'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ–పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 26 | గురువారం | 10.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 26 | Thursday | 10.9.2026 | Pages: 8 | Rate: 2

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచే కుట్ర?

- కేసీఆర్ ఆదేశాలపై సమగ్ర విచారణ
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం ఆగ్రహం



అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌పై జరిగిన మాటల దాడిని సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌ను కలిసి క్షమాపణ చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని, కానీ ఆయన అలా చేయలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్ స్పష్టం చేశారు. ఆ చర్చ జరిగితే తమ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా దళితుడైన స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమే అని సీఎం పేర్కొన్నారు. (వివరాలు 2లో..)



## బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో భారీ షాక్

### కేటీఆర్ హరీశ్‌రావు సహా 22 మందిపై వేటు

#### సభకు అడ్డంకిగా మారారంటూ సస్పెన్షన్

తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడింది. కేటీఆర్, హరీశ్‌రావుతో సహా మొత్తం 22 మంది ఎమ్మెల్యేలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేశారు. శాసనసభా కార్యకలాపాలకు బీఆర్ఎస్ సభ్యులు పదేపదే ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సస్పెన్షన్‌కు ప్రతిపాదన చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. సమావేశాల మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ నిర్ణయాన్ని ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా 22 మంది సభ్యులు ఈ జాబితాలో ఉన్నారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు. (వివరాలు 2లో..)




## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి

తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపై కేంద్రీకరిస్తుందని చెప్పారు. ()



## సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోశారా?

### సీతక్క ఆరోపణలతో అసెంబ్లీ గేటు వివాదం

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద ఇటీవల జరిగిన నిరసన ఘటనపై మరోసారి రాజకీయ దుమారం రేగింది. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డి వెనుక నుంచి నెట్టేశారని ఆమె పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను మీడియా ముందు విడుదల చేశారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు నెట్టేసి గంగుల కమలాకర్ ముందుకు వెళ్లడం సిగ్గుచేటని సీతక్క వ్యాఖ్యానించారు. సొంత పార్టీ మహిళా సభ్యుల పట్ల పురుష ఎమ్మెల్యేలు ఇలా వ్యవహరించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. గత సోమవారం నల్ల చొక్కాలు ధరించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అసెంబ్లీ గేటు వద్ద అడ్డుకున్న సమయంలో ఈ ఘటనలు జరిగినట్లు ఆమె వివరించారు. (వివరాలు 2లో..)






## రైల్వేకు రూ.10 వేల కోట్ల బూస్ట్

### ఘట్‌కేసర్–కాజీపేటకు నాలుగో లైన్

### తెలుగు రాష్ట్రాలకు భారీగా మల్టీట్రాక్

రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.10,021 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్ల విస్తరణ చేపట్టనున్నారు. ()



## బూతులు భరించలేక మాట్లాడా

• కడుపు మండి మాట్లాడాల్సి వచ్చింది • కేసీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే క్లారిటీ

కేసీఆర్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఎవరి చావును కోరుకోవడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. అయితే సభలోనూ, బయటా సీఎం రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అసభ్యకర పదజాలంతో, కులం పేరుతో దూషిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల మాటలు టీవీల్లో వింటున్న మహిళలు చెవులు మూసుకునే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల తీరుతో కడుపుమండి స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీకి దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని కోరే క్రమంలోనే తాను ఆ వ్యాఖ్యలు చేశానని వివరించారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, అది కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని శంకర్ వ్యాఖ్యానించారు. (వివరాలు 2లో..)



## మార్ఫింగ్ ఫోటోలపై బీఆర్ఎస్ ఫిర్యాదు

### డీజీపీ కార్యాలయంలో కంప్లైంట్

అసెంబ్లీ సమావేశాల వేళ పోలీసులపై దాడులకు పాల్పడ్డారంటూ సోషల్ మీడియా, పత్రికల్లో ప్రచురితమైన మార్ఫింగ్ ఫోటోలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. (వివరాలు 2లో..)



## చలో హైదరాబాద్‌కు అడ్డంకులా?

- ఉద్యోగుల నిరసనపై శ్రీనివాస్ గౌడ్ ఫైర్
- అనుమతి నిరాకరణ అప్రజాస్వామికం

ఈ నెల 10న ఉద్యోగ సంఘాలు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను భయపెట్టి తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించవని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. (వివరాలు 2లో..)



## గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

### పోలీసుల దాడి వీడియోలు చూపించామన్న కేటీఆర్

అసెంబ్లీ వద్ద తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి ఫిర్యాదు చేశారు. లోక్‌భవన్‌లో జరిగిన భేటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తన, శాంతిభద్రతల పరిస్థితి వంటి అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనపై నిరసనగా తాము నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేసిన దృశ్యాలకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించామని చెప్పారు. (వివరాలు 2లో..)

## బీఆర్ఎస్ శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

### దళితుల అవమానంపై మంత్రుల ఫైర్

బీఆర్ఎస్ నేతలు చేపట్టిన శుద్ధీకరణ ఘటనపై కాంగ్రెస్ మంత్రులు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. అసెంబ్లీ తొలిరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు, స్పీకర్‌ను అవమానించేలా చేసిన వ్యాఖ్యలు గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. (వివరాలు 2లో..)






## మడిస్తే ఫోన్.. విప్పితే ట్యాబ్లెట్

- అసలు సంచలనం.. ఫోల్డబుల్ ఫోన్
- కొత్త ఫోన్‌తో స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో కొత్త శకం
- మడతలో ఆపిల్ సంచలనం.. ధరలో భారీ షాక్
- ఐఫోన్ 18తో వరల్డ్ టెక్ మార్కెట్‌లో ప్రకంపనలు

ఎదురుచూపులకు తెరపడింది.. ఊహాగానాలకు ముగింపు పలికింది.. ప్రపంచ టెక్ దిగ్గజం ఆపిల్ తన అత్యంత ఆసక్తికరమైన ఐఫోన్ 18 సిరీస్‌ను ఆవిష్కరించింది. అందరి చూపును ఆకర్షించిన తొలి ఫోల్డబుల్ ఐఫోన్ మార్కెట్‌లోకి అడుగుపెట్టడంతో స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో ప్రకంపనలు మొదలయ్యాయి. పుస్తకంలా మడిచే డిజైన్.. ట్యాబ్లెట్‌లా విప్పుకునే భారీ స్క్రీన్.. మెరుపువేగంతో పనిచేసే కొత్త తరం చిప్.. ప్రొఫెషనల్ కెమెరాలను తలదన్నే ఫొటోగ్రఫీ సామర్థ్యం.. ఎక్కువసేపు నిలిచే బ్యాటరీ.. ఏఐతో మరింత తెలివైన వినియోగ అనుభవం.. ఇవన్నీ కలిపి ఐఫోన్ 18ను సాధారణ అప్‌గ్రేడ్ కాకుండా ఆపిల్ చరిత్రలో కీలక మలుపుగా నిలబెట్టాయి. అయితే ఈ సంచలనానికి తగ్గట్టే ధర కూడా వినియోగదారులకు షాక్ ఇచ్చింది. రెండు లక్షల రూపాయలు దాటిన ఫోల్డబుల్ ఐఫోన్ ధరపై చర్చ మొదలైంది. శామ్‌సంగ్, హువావే ఆధిపత్యంలో ఉన్న మడత ఫోన్ మార్కెట్‌లోకి ఆపిల్ ప్రవేశం పోటీని మరింత తీవ్రం చేసింది. భారత్‌లో ఇప్పటికే ఉప్పెనలా పెరుగుతున్న ఐఫోన్ క్రేజ్‌కు ఈ కొత్త మోడల్ మరింత ఊపునిస్తుందా..? ధరను లెక్కచేయకుండా వినియోగదారులు క్యూ కడతారా..? ఆపిల్ చూపించిన కొత్త టెక్ మాయాజాలం.. మార్కెట్‌పై పడబోయే ప్రభావం.. లోపలి పేజీలో ప్రత్యేక కథనం.




## ఏలేటి వ్యాఖ్యలతో అసెంబ్లీలో రగడ

### బీజేపీ వాకౌట్, అజెండా కోసం పట్టు

అసెంబ్లీలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో అధికారపక్షం, ప్రతిపక్షం మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సభలో లేని సభ్యులను సస్పెండ్ చేయడం బాధాకరమని ఏలేటి అన్నారు. సభా ఉల్లంఘన జరిగినప్పుడు బీజేపీ ఎల్పీ నేతగా కొన్ని అంశాలను ప్రస్తావించాల్సిన బాధ్యత తనపై ఉందని చెప్పారు. ఏ నిబంధనల ప్రకారం సభ్యులను సస్పెండ్ చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏమైనా నిబంధనల పుస్తకం రూపొందించారా అంటూ ప్రశ్నించారు. గ్రామాల్లో ఏడు గంటల విద్యుత్ కూడా అందడం లేదని ఆరోపించారు.



## అసెంబ్లీ గేటు ఘటన

- మహిళా పోలీసుల ఫిర్యాదు
- కేటీఆర్, హరీశ్‌తో సహా పలువురిపై కేసులు

అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద జరిగిన ఉద్రిక్తతపై సైఫాబాద్ పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు. మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, దుర్భాషలాడటం, బెదిరించడం వంటి ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి సహా పలువురిపై కేసులు నమోదయ్యాయి. మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ విధులను అడ్డుకున్నారని, మహిళా పోలీసులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, నెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని మహిళా సిబ్బంది ఆరోపించారు. ఘటనతో తమకు మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం కొందరు మహిళా పోలీసులకు ఆసుపత్రిలో చికిత్స అందించినట్లు ఫిర్యాదులో వివరించారు. సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్



సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. కేటీఆర్ వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేలా ఉన్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఎన్ఎస్ సెక్షన్లు 356, 352 కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే అంశంపై హైదరాబాద్ సీపీ సజ్జనార్‌కు కూడా ఫిర్యాదు అందజేశారు. సోషల్ మీడియా, మీడియాల్లో ఉన్న ఆధారాలను భద్రపరచాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మల్లు రవి మండిపడ్డారు. స్పీకర్, సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, పోలీసులతో అసభ్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మహిళా కానిస్టేబుళ్లతో బీఆర్ఎస్ సభ్యులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. హరీశ్‌రావు ఫామ్‌హౌస్ కేంద్రంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కావాలనే రాష్ట్రపతి పాలన కోరుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించడం వేరు.. తిట్టడం వేరని, అసెంబ్లీ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మల్లు రవి స్పష్టం చేశారు.

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచే కుట్ర?

- కేసీఆర్ ఆదేశాలపై సమగ్ర విచారణ
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై సీఎం ఆగ్రహం

### కుట్రదారులపై క్రిమినల్ చర్యలు

అసెంబ్లీ వద్ద జరిగిన వరుస ఘటనలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపడుతుందని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసిన ఘటన, విధుల్లో ఉన్న పోలీసులపై దాడులు, ఇతర పరిణామాలపై పూర్తి వివరాలు సేకరిస్తామని చెప్పారు. కుట్రకు ప్రణాళిక రూపొందించినవారితో పాటు దాన్ని అమలు చేసిన వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించేలా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అంటరానితనం ఆరోపణలపై విచారణ అధికారిగా హైదరాబాద్ జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశం నుంచి అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాల వరకు మొత్తం వ్యవహారంపై విచారణ జరుపుతామని వెల్లడించారు. మహిళల పట్ల అనుచిత ప్రవర్తనను ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. సభలో ప్రతి సభ్యుడు బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమస్యలపై చర్చకు సహకరించాలని సీఎం కోరారు.

### శుద్ధి నేలది కాదు.. ఆలోచనలది

దళిత సభాపతిని అవమానించిన ఘటనతో దళిత సమాజం మనోభావాలు దెబ్బతిన్నాయని రేవంత్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌ను దూషించడాన్ని నిరసిస్తూ ఎస్సీ వర్గాల ప్రజలు డప్పులతో నిరసన తెలిపారని చెప్పారు. తాము ఎవరినీ తిట్టలేదని, దాడి చేయలేదని.. దళిత సమాజానికి క్షమాపణలు చెప్పాలని మాత్రమే కోరారని పేర్కొన్నారు. అయితే ఆ నిరసన జరిగిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం మరింత వివాదానికి దారితీసిందని విమర్శించారు. దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం కాదని, అంటరానితనం ఆలోచనలను శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని రేవంత్



వ్యాఖ్యానించారు. తరతరాలుగా కొనసాగుతున్న కుల వివక్ష, అంతరాలను తొలగించాల్సిన సమయం వచ్చిందన్నారు. మల్లికార్జున ఖర్గే, ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానాలు వ్యక్తులకు జరిగినవి కావని, కులవివక్ష, అణచివేతకు సంబంధించిన అంశాలని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ప్రజా ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని సీఎం హెచ్చరించారు.

# సొంత నేతలే మహిళా ఎమ్మెల్యేలను తోశారా?

## సీతక్క ఆరోపణలతో అసెంబ్లీ గేటు వివాదం

### పోలీసులపై బీఆర్ఎస్ ఆరోపణలు

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు చేయి చేసుకున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తున్న సమయంలో సీతక్క చేసిన తాజా వ్యాఖ్యలు వివాదాన్ని మరో మలుపు తిప్పాయి. విధులకు ఆటంకం కలిగించడం, మహిళా పోలీసుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ ఎదుట చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, తమను నెట్టివేసి ఇబ్బందులకు గురిచేశారని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనలో గాయపడిన మహిళా పోలీసు సిబ్బందిని సీతక్క పరామర్శించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని ఆమె స్పష్టం చేశారు. అయితే సీతక్క విడుదల చేసిన వీడియోలు, ఫొటోలు



నిజమైనవి కావని బీఆర్ఎస్ నేతలు ఖండించారు. అవి మార్ఫింగ్ చేసినవి, ఏఐ ద్వారా రూపొందించినవని ఆరోపించారు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వివాదం మరింత ముదిరింది.

# బూతులు భరించలేక మాట్లాడా

### కేటీఆర్ వీడియో చూపించిన శంకర్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరుపైనా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మీడియా ముందు ప్రస్తావించారు. "ఎక్కడ సచ్చిందు రాహుల్ గాంధీ?" అంటూ కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను మీడియా సమావేశంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై ఇలాంటి పదజాలం ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాజకీయ విభేదాలు ఉన్నా వ్యక్తిగత దూషణలకు హద్దులు ఉండాలని శంకర్ సూచించారు. తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఆయన.. ప్రత్యర్థుల భాషను కూడా ప్రజల ముందు పెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో శంకర్ తాజా



వివరణ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీసింది.

# ఏలేటి వ్యాఖ్యలతో అసెంబ్లీలో రగడ

## బీజేపీ వాకౌట్, అజెండా కోసం పట్టు

బీఏసీలో నిర్ణయించిన ప్రకారం సభ నడుస్తుందా లేదా చెప్పాలని కోరారు. రాష్ట్రంలోని పలు సమస్యలపై చర్చ జరగాల్సి ఉందని తెలిపారు. 22ఏ అంశంపై ఎప్పుడు చర్చిస్తారో స్పష్టత వచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఏలేటి స్పష్టం చేశారు.

### బీజేపీ తీరుపై అధికారపక్షం ఆగ్రహం

ఏలేటి వ్యాఖ్యలపై మంత్రులు, అధికారపక్ష సభ్యులు తీవ్రంగా స్పందించారు. సభ ఔన్నత్యాన్ని కాపాడటం అందరి బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సభలో ఉన్న సభ్యుల గౌరవాన్ని కాపాడేలా మాట్లాడాలని సూచించారు. ఏ అంశంపైనైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సభా కార్యక్రమాలను పదేపదే అడ్డుకోవడం సమంజసం కాదని ప్రశ్నించారు. సభ సజావుగా సాగడం బీజేపీ సభ్యులకు ఇష్టం లేనట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ సభ్యులు



తమ వైఖరి మార్చుకోవాలని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా బీజేపీ తీరుపై మండిపడ్డారు. స్పీకర్‌పై ఇష్టానుసారం మాట్లాడటం సరికాదన్నారు. ఎర్రవల్లిలో దళితుల కార్యక్రమం జరిగిన ప్రాంతాన్ని శుద్ధి చేయడంపై బీజేపీ సభ్యులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యులు శాసనసభ నుంచి వాకౌట్ చేశారు. స్పష్టమైన అజెండా ముందుగా ఇస్తేనే తిరిగి సభకు వస్తామని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రకటించారు.

# బీఆర్ఎస్‌కు అసెంబ్లీలో భారీ షాక్



- కేటీఆర్ హరీశ్‌రావు సహా 22 మందిపై వేటు
- సభకు అడ్డంకిగా మారారంటూ సస్పెన్షన్

తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడింది. కేటీఆర్, హరీశ్‌రావుతో సహా మొత్తం 22 మంది ఎమ్మెల్యేలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేశారు. శాసనసభా కార్యకలాపాలకు బీఆర్ఎస్ సభ్యులు పదేపదే ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సస్పెన్షన్‌కు ప్రతిపాదన చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. సమావేశాల మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 'వీ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లి సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ నిర్ణయాన్ని ప్రకటించారు. కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహా 22 మంది సభ్యులు ఈ జాబితాలో ఉన్నారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు.

### దళితుల అవమానంపై భట్టి ఫైర్

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభాపతిని అవమానించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని కోరారు. స్పీకర్ సూచనలు పాటిస్తూ సభ సజావుగా సాగేందుకు సహకరించాలని సూచించారు. వెల్‌లోకి వచ్చి నిరసనలు చేయడం, సభాపతిపై సవాళ్లు విసరడం సరికాదన్నారు. సభాపతి, ఆయన తల్లిని దూషించిన ఘటనలను కూడా భట్టి ప్రస్తావించారు. ఎర్రవల్లిలో దళిత సంఘాల నిరసన అనంతరం వారు నడిచిన రోడ్డును పసుపు నీటితో శుద్ధి చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అవమానానికి గురైనది బలహీనవర్గాలు, దళితులు, గిరిజనులేనని అన్నారు. విపక్ష నేతల చర్యలను ప్రభుత్వం ఇంతకాలం సంయమనంతో భరించిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు దొరతనం పోకడలను ఇక భరించే పరిస్థితిలో లేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. సభా గౌరవాన్ని కాపాడుతూ ప్రజా సమస్యలపై చర్చ జరిగేలా ప్రతిపక్షం సహకరించాలని అధికారపక్షం కోరింది.

# అసెంబ్లీ గేటు ఘటన

- మహిళా పోలీసుల ఫిర్యాదు
- కేటీఆర్, హరీశ్‌తో సహా పలువురిపై కేసులు

అసెంబ్లీ గేట్ నంబర్ 3 వద్ద జరిగిన ఉద్రిక్తతపై సైఫాబాద్ పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు. మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, దుర్భాషలాడటం, బెదిరించడం వంటి ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి సహా పలువురిపై కేసులు నమోదయ్యాయి. మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ విధులను అడ్డుకున్నారని, మహిళా పోలీసులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఎదుట టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిలబడ్డారని, నెట్టడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని మహిళా సిబ్బంది ఆరోపించారు. ఘటనతో తమకు మానసిక వేదన, అవమానం కలిగిందని తెలిపారు. ఘటన అనంతరం కొందరు మహిళా పోలీసులకు ఆసుపత్రిలో చికిత్స అందించినట్లు ఫిర్యాదులో వివరించారు. సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

### నల్ల టీషర్టులతో మొదలైన వివాదం

అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలి రోజు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలతో ఉన్న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. టీషర్టులపై ఉన్న నినాదాలకు అనుమతి లేదని, స్పీకర్ ఆదేశాల మేరకు లోపలికి అనుమతించడం లేదని పోలీసులు తెలిపారు. దీంతో హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అక్కడే టీషర్టులు తొలగించి బనియన్లతో నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట జరిగింది. మహిళా పోలీసులకు తీవ్ర అసౌకర్యం కలిగేలా పరిస్థితి మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో వివాదం మరింత ముదిరింది. మహిళా పోలీసులపై జరిగిన అనుచిత ప్రవర్తనపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క ప్రకటించిన నేపథ్యంలో తాజాగా కేసులు నమోదయ్యాయి. దీంతో అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటన రాజకీయ వివాదంతో పాటు పోలీసు కేసుల వరకు వెళ్లింది.





# గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

## పోలీసుల దాడి వీడియోలు చూపించామన్న కేటీఆర్

అసెంబ్లీ వద్ద తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసి ఫిర్యాదు చేశారు. లోక్‌భవన్‌లో జరిగిన భేటీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తన, శాంతిభద్రతల పరిస్థితి వంటి అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనపై నిరసనగా తాము నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని తెలిపారు. ఈ సందర్భంగా తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేసిన దృశ్యాలకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించామని చెప్పారు. సబితా ఇంద్రారెడ్డిపై పోలీసుల దాడి, అవమానానికి సంబంధించిన ఆధారాలు ఇచ్చామని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగిన ఘటనపైనా ఆధారాలు చూపించామని కేటీఆర్ పేర్కొన్నారు. తమపై దాడులు చేసిన తర్వాత తమపైనే కేసులు నమోదు చేశారని ఆరోపించారు.

### కాంగ్రెస్‌పై హామీల అమలులో వైఫల్యం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి.. 1,000 రోజులు గడిచినా 420కి పైగా హామీలు అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు అందించిందని గుర్తుచేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను కూడా సక్రమంగా అందించలేకపోతోందని విమర్శించారు. రైతు బీమాను నీరుగార్చి రైతులకు భరోసా లేకుండా చేశారని, నిరుద్యోగ యువతను కూడా ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై గవర్నర్‌కు వివరంగా వివరించామని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు చెప్పారు.

### కేసులు పెట్టారు.. మాపైనే చర్యలా?

అసెంబ్లీ వద్ద జరిగిన దాడులపై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు తమ పార్టీ నేతలపైనే కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వచ్చిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. పార్లమెంట్‌కు రాహుల్‌గాంధీ నల్ల దుస్తులతో వెళ్లిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ.. తాము కూడా కాంగ్రెస్ 1,000 రోజుల పాలనపై నిరసన తెలిపేందుకు అదే తరహాలో నల్ల దుస్తులు ధరించామని చెప్పారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన ఘటనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని, తమ ఫిర్యాదులపై తక్షణ జోక్యం చేసుకోవాలని కోరామని కేటీఆర్ వెల్లడించారు. పోలీసుల దాడులపై విచారణ, హామీల అమలు, రైతులు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది.

# బీఆర్ఎస్ శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

## దళితుల అవమానంపై మంత్రుల ఫైర్

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఆయన తల్లిని బీఆర్ఎస్ నేతలు దూషించారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. దీనిని నిరసిస్తూ దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో డప్పులతో శాంతియుతంగా నిరసన తెలిపారని చెప్పారు. అయితే వారు నడిచిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేయడం దళితుల పట్ల అంటరానితనానికి నిదర్శనమని విమర్శించారు. కేసీఆర్ ఆదేశాలు లేకుండా ఈ శుద్ధీకరణ జరిగిందా అని ప్రశ్నించిన అడ్లూరి.. దీనిపై కేసీఆర్ ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు.

### కుల వివక్షకు తావులేదన్న మంత్రి

బీఆర్ఎస్ నేతల శుద్ధీకరణపై కేసీఆర్ మౌనం వీడాలని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపిన దళితులను అవమానించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రజాపాలనలో అంటరానితనానికి స్థానం లేదని, కుల వివక్షకు సంబంధించిన ఏ ఘటననూ ప్రభుత్వం సహించబోదని హెచ్చరించారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల ఫిర్యాదుపై స్పీకర్ స్పందించి విచారణకు ఆదేశించారని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇదిలా ఉంటే ఉదయం కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా గవర్నర్‌ను కలిసి అసెంబ్లీలో తొలిరోజు చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. తమ సభ్యుల సస్పెన్షన్, పోలీసుల వ్యవహారశైలిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఒకే రోజు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్గాలు గవర్నర్‌ను కలిసి పరస్పర ఆరోపణలు చేయడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# చలో హైదరాబాద్‌కు అడ్డంకులా?

- ఉద్యోగుల నిరసనపై శ్రీనివాస్ గౌడ్ ఫైర్
- అనుమతి నిరాకరణ అప్రజాస్వామికం




ఆరు గ్యారంటీల్లో భాగంగా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మూడు సంవత్సరాలుగా సమస్యలను పెండింగ్‌లో ఉంచడం సరికాదని ప్రశ్నించారు. ఇప్పుడు మరో రెండేళ్లు ఏమీ అడగొద్దని చెప్పడం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీకి హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో సభ నిర్వహించేందుకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. ఇప్పుడు ఉద్యోగుల శాంతియుత కార్యక్రమానికి అనుమతి ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

### పీఆర్సీ, ఓపీఎస్ హామీలు ఎక్కడ?

ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో సీపీఎస్ రద్దు చేసి ఆరు నెలల్లో ఓపీఎస్ తీసుకువస్తామని, పీఆర్సీ ప్రక్రియను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని శ్రీనివాస్ గౌడ్ గుర్తుచేశారు. ఆ హామీలు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. పోలీసు శాఖలో డీఏలు, టీఏలు, ట్రావెలింగ్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ వంటి బకాయిలు ఉన్నాయని తెలిపారు. హోంగార్డుల సమస్యలు కూడా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని అన్నారు. ఆశా వర్కర్లు తమ సమస్యలను ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం, కేసులు పెట్టడం సరికాదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిందని చెబుతూ, 42 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రారంభించి మొత్తం 75 శాతం ఫిట్‌మెంట్ వరకు అందించిన ఘనత గత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# మార్ఫింగ్ ఫొటోలపై బీఆర్ఎస్ ఫిర్యాదు

## డీజీపీ కార్యాలయంలో కంప్లైంట్



అసెంబ్లీ సమావేశాల వేళ పోలీసులపై దాడులకు పాల్పడ్డారంటూ సోషల్ మీడియా, పత్రికల్లో ప్రచురితమైన మార్ఫింగ్ ఫొటోలపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. ఏఐ మార్ఫింగ్ ఫొటోలతో ప్రభుత్వం తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తమపై దాడి జరిగిందని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు కాలేదని అన్నారు. వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మహిళా నాయకులతో పోలీసులు వ్యవహరించిన తీరు గర్హనీయమని పేర్కొన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడికి యత్నించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై కేసులు పెట్టాలని కోరారు. కేసీఆర్ ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లడం వల్లే ఆ స్థలం అపవిత్రమైందని, దళితుల వల్ల కాదని స్పష్టం చేశారు. డైవర్షన్ రాజకీయాలతో ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని, అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు కేటాయించిన విలువైన సమయాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు.

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- తెలంగాణలో బీజేపీ అధికారమే లక్ష్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి

తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ విజయాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపై కేంద్రీకరిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవడమే పార్టీ తదుపరి ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని బండి సంజయ్ అన్నారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన కాంగ్రెస్ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని విమర్శించారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలైందని పేర్కొన్నారు.

### కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో డబ్బు తరలిస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధించారని విమర్శించారు. కేంద్ర ఆర్థిక సహాయంతో అమలవుతున్న ఉచిత సన్నబియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తన సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. గత కేసీఆర్ పాలనను రజాకార్ల పాలనతో పోల్చుతూ, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడిందని గుర్తుచేశారు. తనపై 109 అక్రమ కేసులు నమోదైనా వెనక్కి తగ్గలేదని బండి సంజయ్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని,



పోలీసు కేసులకు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో బీజేపీ శ్రేణులు మరింత దూకుడుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైల్వేకు రూ.10 వేల కోట్ల బూస్ట్

- ఘట్‌కేసర్–కాజీపేటకు నాలుగో లైన్
- తెలుగు రాష్ట్రాలకు భారీగా మల్టీట్రాక్



రైల్వే రవాణా సామర్థ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా పలు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం రూ.10,021 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్ల విస్తరణ చేపట్టనున్నారు. తెలంగాణలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య 110 కిలోమీటర్ల నాలుగో లైన్‌కు రూ.2,419 కోట్లతో గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఆంధ్రప్రదేశ్ మీదుగా వెళ్లే అరక్కోణం-రేణిగుంట మార్గంలో 77 కిలోమీటర్ల మేర 3వ, 4వ లైన్ల నిర్మాణానికి ఆమోదం లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక పరిధిలో మొత్తం ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు. వైట్‌ఫీల్డ్-బంగారుపేట మధ్య 47 కిలోమీటర్లు, సేలం-కరూర్-దుండిగల్ మధ్య 159 కిలోమీటర్లు, హోసూర్-ఒమలూరు మధ్య 147 కిలోమీటర్ల డబ్లింగ్ పనులకు కూడా అనుమతి ఇచ్చారు. 2029-30 నాటికి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

### రైళ్ల వేగం.. సరుకు రవాణాకు ఊపు

కొత్త రైల్వే లైన్లతో రద్దీ మార్గాల్లో రైళ్ల రాకపోకల సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రయాణికుల రైళ్లతో పాటు సరుకు రవాణా వేగం కూడా మెరుగుపడనుంది. 4,790 గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందనున్నాయని కేంద్రం తెలిపింది. బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు వంటి కీలక సరుకుల రవాణా సులభం కానుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏటా అదనంగా సుమారు 47 మిలియన్ టన్నుల సరుకు రవాణాకు అవకాశం ఏర్పడుతుందని అంచనా. పర్యాటక, పుణ్యక్షేత్రాలకు రైలు కనెక్టివిటీ కూడా మెరుగుపడనుంది. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ ఆధారంగా ప్రాజెక్టులను రూపొందించారు. రైల్వే నెట్‌వర్క్ విస్తరణతో చమురు దిగుమతులు తగ్గుతాయని కేంద్రం పేర్కొంది. దాదాపు 12 కోట్ల లీటర్ల చమురు దిగుమతి ఆదా, 62 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుందని అంచనా వేసింది. ఇదిలా ఉండగా బుల్లెట్ రైలు పనులు కూడా వేగంగా సాగుతున్నాయని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వచ్చే ఏడాది పరీక్షలు పూర్తయ్యాక 2027లో ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

# 2027 సెకండ్ పార్ట్‌లో పాదయాత్ర

- షెడ్యూల్ వెల్లడించిన వైఎస్ జగన్



పాదయాత్ర ప్రకటనతో ఏపీ రాజకీయాల్లో మళ్లీ కదలిక మొదలైంది. ఓటమి తర్వాత స్తబ్దుగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్‌లో జగన్ కొత్త వ్యూహానికి తెరతీశారా? వచ్చే ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు స్థానిక సంస్థల ఎన్నికలు.. మరోవైపు ఓటర్ల జాబితా సవరణ.. ఇంకోవైపు బీసీ రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కులపై జగన్ వ్యక్తం చేస్తున్న అనుమానాలు.. ఇవన్నీ వైసీపీ రాజకీయ వ్యూహానికి కొత్త దిశను సూచిస్తున్నాయి. స్థానిక ఎన్నికలే కేడర్‌కు అసలైన పరీక్ష అంటూ జగన్ ఇచ్చిన పిలుపు పార్టీ శ్రేణుల్లో జోష్ నింపే ప్రయత్నంగా కనిపిస్తోంది. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుడి వరకు ప్రతి స్థాయిలో పార్టీ బలాన్ని చూపించాలని ఆయన పిలుపునిచ్చారు. గత పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెబుతూనే.. కూటమి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. నంద్యాల నుంచి 2019 వరకు.. గత రాజకీయ అనుభవాలను గుర్తుచేసిన జగన్.. అధికార ఒత్తిళ్లు క్షేత్రస్థాయి మద్దతును ఆపలేవంటూ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.



# నేడు, రేపు 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు

- 19 అంశాలపై రెండు రోజుల కీలక సమీక్ష
- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 10, 11 తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. రెండు రోజుల పాటు జరిగే సమావేశాల్లో మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు పాల్గొంటారు. 7వ కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాల అమలు నివేదికతో తొలిరోజు సమావేశాలు ప్రారంభమవుతాయి. జీఎస్డీపీ, స్వర్ణాంధ్ర విజన్ జిల్లాల రోడ్‌మ్యాప్‌లు, సూపర్ సిక్స్ పథకాలు, తాగునీరు, గృహ నిర్మాణం, ఆరోగ్యం, విద్య, పెట్టుబడులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, జలధార, జిల్లాల బెస్ట్ ప్రాక్టీసెస్‌పై సమీక్ష జరగనుంది. రెండో రోజు ఈ-గవర్నెన్స్, ఫైళ్ల పరిష్కారం, ఆర్టీజీఎస్, ప్రజా సమస్యల పరిష్కారం, జిల్లాల ర్యాంకింగ్స్, భూ పరిపాలన, కేంద్ర నిధుల వినియోగం, నైపుణ్యాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం, శాంతిభద్రతలపై చర్చిస్తారు. క్షేత్రస్థాయి పాలనను మరింత సమర్థవంతంగా మార్చేలా కలెక్టర్లకు సీఎం కీలక దిశానిర్దేశం చేయనున్నారు.

# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు చెక్

- ఇద్దరు బుకీల అరెస్ట్, రూ.20 వేల స్వాధీనం




ప్రొద్దుటూరులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌పై పోలీసులు కొరడా ఝుళిపించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు బుకీలను ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని REDDY.99.APP ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఎస్సై మొయినుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి హుస్సేన్, సురేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌తో పాటు మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత బెట్టింగ్ మాయలో పడి ఆర్థికంగా నష్టపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బెట్టింగ్ నిర్వహిస్తున్నా, ప్రోత్సహిస్తున్నా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనుమానాస్పదంగా బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తుల వివరాలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడితో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిలో కలకలం మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భారీ భద్రత

- 3 వేల కెమెరాలు, డ్రోన్లతో తిరుమల నిఘా
- లక్షలాది భక్తుల కోసం పటిష్ట ఏర్పాట్లు

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు టీటీడీ, తిరుపతి జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దేశవిదేశాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు సాఫీ దర్శనం కల్పించడమే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. తిరుపతిలో కీలక ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్, హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండపై రద్దీ పెరిగితే భక్తులను తిరుపతిలోనే నియంత్రించి దశలవారీగా తిరుమలకు తరలిస్తారు. హోల్డింగ్ పాయింట్లలో భారీ ఎల్ఈడీ స్క్రీన్లపై వాహనసేవల ప్రత్యక్ష ప్రసారం, ఉచిత అన్నప్రసాదం, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి సదుపాయాలు కల్పించనున్నారు. బ్రహ్మోత్సవాల వివరాలతో రూపొందించిన 2026 బుక్లెట్‌ను చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర ఆవిష్కరించారు.



### సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా

భక్తుల భద్రతకు తిరుమల, తిరుపతి పరిధిలో సుమారు 3 వేల సీసీటీవీ కెమెరాలు, అత్యాధునిక డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ చేపట్టనున్నారు. అలిపిరి టోల్‌గేట్, అలిపిరి నడకమార్గం, శ్రీవారిమెట్టు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేశారు. అలిపిరి వద్ద ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలను ఏర్పాటు చేసి తిరుమల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. పాత నేరస్థుల డేటాబేస్ ఆధారంగా సుమారు 1,500 మంది అనుమానితులను గుర్తించే సాంకేతిక వ్యవస్థ సిద్ధం చేశారు. టీటీడీ, పోలీసు, మున్సిపల్, రవాణా, ఆరోగ్య శాఖల మధ్య సమన్వయంతో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ పనిచేయనుంది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని అడ్డుకునేందుకు ప్రత్యేక బృందం, అత్యవసర పరిస్థితుల కోసం డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచుతున్నారు.

### గరుడసేవకు భారీ బలగాలు

గరుడసేవ రోజున గతేడాదితో పోలిస్తే 15-20 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని టీటీడీ అంచనా వేసింది. గత ఏడాది 6.13 లక్షల మందికి అన్నప్రసాదం అందించగా, ఈసారి సుమారు 9.30 లక్షల మందికి అన్నప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ 10 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచనున్నారు. భద్రత కోసం 3 వేల మంది పోలీసులు, 2,500 మంది టీటీడీ భద్రతా సిబ్బందిని మోహరించనున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు మరో 3,000-3,300 మంది సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టారు. రిలయన్స్ 25 ఎలక్ట్రిక్ బస్సులను టీటీడీకి విరాళంగా ఇవ్వనుంది. లడ్డూల ఉత్పత్తి పెంపు కోసం శ్రీవారి పోటులో 400 అదనపు ఔట్‌సోర్సింగ్ పోస్టులకు ప్రభుత్వ అనుమతి కోరనున్నారు. ఆహార వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీకి రూ.2.80 కోట్ల ప్రాజెక్టుకు ఆమోదం లభించింది. దర్శనం నుంచి రవాణా వరకు ప్రతి విభాగాన్ని ముందుగానే సిద్ధం చేస్తూ, బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు టీటీడీ సమగ్ర భద్రతా ప్రణాళికను అమలు చేయనుంది.

# తిరుమల భక్తులకు టీటీడీ బీమా భరోసా

- దర్శనానికి వస్తే రూ.2 లక్షల ఇన్సూరెన్స్

తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుమల పర్యటన సమయంలో భక్తుడికి సహజ మరణం సంభవిస్తే, ఆ కుటుంబానికి రూ.2 లక్షల బీమా అందించే పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. సాధారణంగా ప్రమాదవశాత్తు మరణాలకు మాత్రమే బీమా వర్తించే సందర్భాలు ఉండగా, తిరుమలలో సహజ మరణానికీ బీమా సౌకర్యం కల్పించనుండటం ప్రత్యేకతగా నిలుస్తోంది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ పథకాన్ని తీసుకురావాలని టీటీడీ నిర్ణయించింది.

### ఎల్ఐసీతో బీమా ఒప్పందం

భక్తులకు అందించనున్న ఈ బీమా పథకం కోసం ఎల్ఐసీ సంస్థకు టీటీడీ నిధుల నుంచి రూ.2.12 కోట్లు చెల్లించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన సమయంలో అనుకోని విషాదం చోటుచేసుకుంటే, వారి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఈ బీమా కొంతమేర అండగా నిలవనుంది. భక్తుల ఆధ్యాత్మిక యాత్రకు భద్రతా భరోసాను జోడించేలా టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి కూడా పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రస్తుతం అందుతున్న బీమా మొత్తాన్ని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని నిర్ణయించింది.



# మూడేళ్ల నాటి ఘటనను గుర్తుచేసుకున్న టీడీపీ శ్రేణులు



చంద్రబాబు నాయుడు అరెస్టు ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రొద్దుటూరులో టీడీపీ నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నాటి చీకటి రోజును గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 9న చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజుల పాటు జైలులో నిర్బంధించారని పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు చంద్రబాబుకు అండగా నిలిచారని గుర్తుచేశారు. చంద్రబాబు అరెస్టు ఘటనను టీడీపీ శ్రేణులు ఎప్పటికీ మర్చిపోలేవని అన్నారు. మూడేళ్ల క్రితం చోటుచేసుకున్న పరిణామాలను స్మరించుకుంటూ కొవ్వొత్తులు వెలిగించామని తెలిపారు. చంద్రబాబు రాజకీయ జీవితంలో నిబద్ధత, ప్రజాసేవకు టీడీపీ కార్యకర్తలు ఎప్పటికీ అండగా ఉంటారని పేర్కొన్నారు. పార్టీపై అభిమానంతో కార్యక్రమానికి తరలివచ్చిన కార్యకర్తలు 'నిజం గెలిచింది' అంటూ నినాదాలు చేస్తూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు. దీంతో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది.

# ఏపీలో విద్యుత్ వాహనాలకు మరింత ప్రోత్సాహం

- ఈవీలకు 5% రాయితీ.. మంత్రి మండిపల్లి వెల్లడి

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం కీలక ప్రోత్సాహకాలు ప్రకటించింది. 2024-29 సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ ద్వారా ఈవీ తయారీదారులతో పాటు కొనుగోలుదారులకు రాయితీలు అందిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, రవాణా వాహనాలు, ట్రాక్టర్ల కొనుగోలుపై ఎక్స్‌షోరూమ్ ధరలో 5 శాతం వరకు రాయితీ కల్పించినట్లు చెప్పారు. ఈ ప్రయోజనం 2027 మార్చి వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకునే ఈవీలకు ఐదేళ్లపాటు రోడ్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఛార్జింగ్ మౌలిక వసతుల విస్తరణకు తొలి 5,000 కేంద్రాల ఏర్పాటుపై 25 శాతం వరకు, గరిష్ఠంగా రూ.3 లక్షల ప్రోత్సాహకం అందిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణహిత రవాణా వ్యవస్థకు ఈవీ పాలసీ బలమైన పునాది వేస్తోందన్నారు.






# గరివిడి వెటర్నరీ కళాశాలపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

- టీడీపీ హయాంలోనే కాలేజీ ఏర్పాటైందన్న అచ్చెన్నాయుడు

గరివిడి వెటర్నరీ కళాశాలపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం హాస్యాస్పదమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కళాశాలను 2016లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 2017లో రూ.81.72 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, 2018లో 90 ఎకరాల భూమి కేటాయించి నిర్మాణాలు ప్రారంభించామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బోధనా పోస్టులు భర్తీ చేయలేదని, ప్రయోగశాల పరికరాలు సమకూర్చలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లులు పరిష్కరించి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్లినికల్ కాంప్లెక్స్, వసతిగృహాల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. వీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా 99 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం 253 బోధనా పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి పొందామని, ప్రస్తుతం కాంట్రాక్ట్ అధ్యాపకులతో సిబ్బంది సంఖ్య 77కు చేరిందన్నారు. ఆరు నెలల్లో నియామకాలు పూర్తి చేసి వీసీఐ అనుమతులు పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు ముందుగా తమ ఐదేళ్ల పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

# నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ ప్రాచుర్యం

- విశాఖ వేదికగా 41వ ఐఏటీఓ సదస్సు.. కందుల దుర్గేష్



నవ్యాంధ్ర పర్యాటకానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా విశాఖపట్నం వేదికగా 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఏటీఓ) జాతీయ సదస్సు జరగనుంది. ఈ నెల 10 నుంచి 12 వరకు "ఇండియా-ది వరల్డ్స్ నెక్స్ట్ టూరిజం ఆపర్చునిటీ" థీమ్‌తో నిర్వహించే సదస్సులో దేశవ్యాప్తంగా వెయ్యి మందికిపైగా పర్యాటక రంగ ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, విధాన నిర్ణేతలు, పారిశ్రామికవేత్తలు పాల్గొంటారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నవ్యాంధ్ర ఏర్పాటైన తర్వాత తొలిసారిగా ఏపీ ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ఆతిథ్యమిస్తోందన్నారు. ఏపీకి చెందిన సముద్ర తీరం, ఆధ్యాత్మిక క్షేత్రాలు, అరకు లోయ, గిరిజన సంస్కృతి, బౌద్ధ ప్రదేశాలు, ప్రకృతి అందాలను అంతర్జాతీయ పర్యాటక పటంపై నిలిపేందుకు సదస్సు కీలక వేదికగా మారుతుందని చెప్పారు. ఐఏటీఓ సభ్యుల కోసం 13న ఆరు ప్రత్యేక పోస్ట్ కన్వెన్షన్ టూర్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.




# ఆపిల్ ఫోల్డబుల్ ఫోన్ వచ్చేసింది!

- రూ.2.99 లక్షల నుంచి ఐఫోన్ డ్యుయో

యాపిల్ తొలిసారిగా మడతపెట్టే ఫోన్‌ను విడుదల చేసింది. 'ఐఫోన్ డుయో' పేరుతో వచ్చిన ఈ ఫోన్ భారతదేశంలో రూ.2,99,900 ప్రారంభ ధరతో లభించనుంది. 256 జీబీ మోడల్ ధర రూ.2,99,900 కాగా, 512 జీబీ ధర రూ.3,24,900, 1 టెరాబైట్ ధర రూ.3,74,900, 2 టెరాబైట్ ధర రూ.4,49,900గా నిర్ణయించారు. స్టార్ వైట్, నైట్ స్కై రంగుల్లో ఫోన్ అందుబాటులో ఉంటుంది. అక్టోబర్ 16 నుంచి ముందస్తు బుకింగ్‌లు ప్రారంభం కాగా, అక్టోబర్ 23 నుంచి విక్రయాలు మొదలవుతాయి. ఐఫోన్ డుయోలో 7.6 అంగుళాల మడత తెర, 5.4 అంగుళాల బయటి తెర ఉన్నాయి. ఏ20 ప్రో చిప్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో వెనుక రెండు 48 మెగాపిక్సెల్ కెమెరాలు ఉన్నాయి. 12 మెగాపిక్సెల్ టెలిఫోటో కెమెరా 2 రెట్లు ఆప్టికల్ జూమ్ అందిస్తుంది. లోపలి తెరపై ఫేస్‌టైమ్ కెమెరా ఉంది. ఐఓఎస్ 27తో వచ్చే ఫోన్‌లో ఒకేసారి పలు పనులు చేసుకునేలా ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. మ్యాగ్‌సేఫ్ వైర్‌లెస్ ఛార్జింగ్‌కు మద్దతు ఉంది. భౌతిక సిమ్‌కు బదులుగా ఈసిమ్ మాత్రమే ఉంటుంది. ఒకసారి ఛార్జ్ చేస్తే లోపలి తెరపై 31 గంటలు, బయటి తెరపై 44 గంటల వరకు వీడియో చూడవచ్చని యాపిల్ తెలిపింది.



# ప్రతిష్టాత్మకంగా గోదావరి పుష్కరాలు

- రూ.300 కోట్లతో రహదారులకు మహర్దశ
- ఆరు జిల్లాల్లో 78 రోడ్లకు పునరుద్ధరణ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రహదారుల అభివృద్ధికి రూ.300 కోట్లను మంజూరు చేసినట్లు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక శాఖ ఆమోదం పొందిన ఈ నిధులతో గోదావరి పరిసరాల్లోని తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, పోలవరం, ఏలూరు జిల్లాల్లో 78 రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. మొత్తంగా 431 కి.మీ మేర స్టేట్ హైవేలు, జిల్లా ప్రధాన రహదారులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. ఇందులో 275 కి.మీ మేర 41 స్టేట్ హైవే పనులకు రూ.185.75 కోట్లు, 155 కి.మీ మేర 37 జిల్లా ప్రధాన రహదారులకు రూ.114.25 కోట్లు కేటాయించినట్లు వివరించారు. పుష్కరాలకు తరలివచ్చే భక్తులకు సురక్షిత, సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.



## యువత చేతుల్లో పర్యావరణ పరిరక్షణకు కొత్త ఊపిరి

ప్రొద్దుటూరులో పర్యావరణ పరిరక్షణకు యువత కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని 11వ వార్డు స్వయం సేవక్ వీధిలో బుధవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని ఆయన పిలుపునిచ్చారు. యువతలో పర్యావరణ చైతన్యం పెరిగితే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. ఒంటేరు సోదరులు శ్రీనివాసులురెడ్డి, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక యువత స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొంది. ప్రముఖ వైద్యులు నాగదస్తగిరిరెడ్డి, ఎన్‌టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఎగ్జిక్యూటివ్ మెంబర్ టి.డి. వరుణ్ కుమాం రెడ్డి ప్రత్యేకంగా పాల్గొని యువతతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణతో పాటు ప్రజల్లో పర్యావరణ అవగాహన కల్పించడంలో యువత చూపిన చొరవ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భవిష్యత్తులో మరిన్ని పర్యావరణ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.




## ఫీజులు వెంటనే చెల్లించాలి

**రూ.14 వేల కోట్ల బకాయిలపై విద్యార్థుల నిరసన**

వనపర్తి జిల్లా కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ–జేఏసీ రాష్ట్ర నాయకుడు బింగి రాము యాదవ్, ధర్మ సమాజ్ పార్టీ నాయకుడు వీరపాగ శివ మహారాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. రూ.14 వేల కోట్ల బకాయిలు విడుదల కాకపోవడంతో సుమారు 30 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం పాలిటెక్నిక్ కళాశాల వద్ద దీక్షా శిబిరం ఏర్పాటు చేశారు. ఫీజులు చెల్లించలేక బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల చదువులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని బింగి రాము యాదవ్ పేర్కొన్నారు. పరిస్థితులు తీవ్రంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య ప్రభావం దాదాపు కోటి కుటుంబాలపై పడుతోందని వీరపాగ శివ మహారాజ్ తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు శివ, సుబ్బయ్య యాదవ్, మధు, సంధ్యారాణి, మన్యం తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ యాసకు అక్షర గౌరవం

**కాళోజీ కలానికి ఘన నివాళి... మానాల పాఠశాలలో భాషా దినోత్సవం**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు తిరుపతి విద్యార్థులకు తెలంగాణ భాష, యాస ప్రత్యేకతలను వివరించారు. కాళోజీ సాహిత్య ప్రస్థానం, ప్రజల్లో చైతన్యం తీసుకు రావడంలో ఆయన పోషించిన పాత్రను వివరించారు. తెలంగాణ యాస మన సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మాతృభాషపై ప్రతి విద్యార్థి గౌరవం పెంచుకోవాలని, తెలంగాణ సాహిత్యాన్ని చదివి గొప్ప రచయితల గురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం కాళోజీ నారాయణరావు చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. భాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిరుపతితో పాటు ఉపాధ్యాయులు మానస, గౌతమి, వాణి, ప్రియాంక, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ యాస గొప్పతనాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో భాషాభిమానం పెంచింది.

## స్థానిక పోరుకు వైసీపీ శ్రేణులు సిద్ధం

**టీడీపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**



ప్రొద్దుటూరులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు పూల శ్రీనివాసులురెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డుల ప్రాధాన్యతను నాయకులు, కార్యకర్తలకు వివరించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని సూచించారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలకు ఏ ఇబ్బంది ఎదురైనా నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఇప్పటి నుంచే గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని నేతలు సూచించారు. సమావేశంలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మహిళా నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి మఠంలో కొలువుల కలకలం

**మేనేజర్ పోస్టుపై ఆరోపణలు... ఇతర నియామకాలపైనా ప్రచారాలు... బెస్తవారిపేట టు బ్రహ్మంగారి**



కాలజ్ఞాని శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధిగా నిష్ఠ వహించిన పవిత్ర క్షేత్రం అది. వందల ఏళ్లుగా భక్తుల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీకగా నిలిచిన పుణ్యస్థలం. భక్తి, ఆధ్యాత్మికత, కాలజ్ఞానం అనే మూడు మాటలతో గుర్తుకొచ్చే ఆ మఠం పేరు ఇప్పుడు మరో కారణంతో వినిపిస్తోంది. వివాదాలు.. ఆరోపణలు.. పదవుల చుట్టూ పుకార్లు.. ఇవే మఠం పేరు చుట్టూ తిరుగుతున్నాయని అంటున్నారు. ఒకప్పుడు భక్తి పరిమళాలు వెదజల్లిన ప్రాంగణం ఇప్పుడు ఎవరి ప్రయోజనాలకు వేదికగా మారుతోందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మఠాధిపత్య వారసత్వంపై రెండు కుటుంబాల మధ్య నడుస్తున్న వివాదం ఒకవైపు ఉంటే.. తాజాగా మఠంలో కొలువుల వ్యవహారం మరో కొత్త చర్చకు తెరలేపిందని భక్తులు అంటున్నారు. తాత్కాలిక మఠాధిపతిగా కొత్త స్వాములవారు పీఠంపై ఆశీనులైన సమయంలోనే మఠంలోని పరిపాలనా వ్యవహారాలపై కొత్త ఆరోపణలు తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఖాళీ అయిన మేనేజర్ పోస్టు చుట్టూ జరుగుతున్న పరిణామాలు మఠం వీధుల్లోనే కాదు.. సోషల్ మీడియాలోనూ తీవ్ర చర్చకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. ఆ పోస్టు కోసం ఏకంగా రూ.30 లక్షల వరకు బేరం నడిచిందనే ప్రచారం తాజాగా కలకలం రేపుతోంది. ఇక్కడే పనిచేస్తున్న ఒక ఉద్యోగి తనకు అనుకూలమైన వ్యక్తుల ద్వారా ఆ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారట. అంతేకాదు.. ఆ ఉద్యోగి తరపున సన్నిహితులు భారీ మొత్తంతో బేరసారాలకు సిద్ధమయ్యారనే ప్రచారం కూడా వినిపిస్తోందట.

### ఒకే పోస్టు.. మూడు పేర్లు.. రూ.30 లక్షల ప్రచారం

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఒక ప్రభుత్వ అనుబంధ ఆధ్యాత్మిక సంస్థలోని కీలక పదవి కోసం డబ్బు బేరం జరిగిందా? జరిగితే ఎవరు బేరం పెట్టారు? ఎవరి వద్ద బేరం పెట్టారు? డబ్బు ఇవ్వాల్సి వస్తే ఎవరికి ఇవ్వాలి? ఇలాంటి వ్యవహారాల వెనుక ఎవరి హస్తం ఉంది? అన్న ప్రశ్నలు భక్తుల నుంచి వస్తున్నాయి. అయితే ఇప్పటివరకు బయటకు వస్తున్నవన్నీ ఆరోపణలు, ప్రచారాలే తప్ప.. వాటిని నిర్ధారించే అధికారిక ఆధారాలు బహిరంగంగా లేవన్నది కూడా గుర్తుంచుకోవాల్సిన అంశమే. కానీ ఆరోపణలు ఇంత తీవ్రంగా వినిపిస్తున్నప్పుడు సంబంధిత అధికారులు మౌనం వహించడమే అనుమానాలకు మరింత తావిస్తోందని భక్తులు అంటున్నారు. మేనేజర్ పోస్టు చుట్టూ ఇంత కథ నడవడానికి మరో కారణం కూడా ఉందని చెబుతున్నారు. ఒక దశలో దాదాపు నాలుగేళ్లు పిట్ పర్సన్‌గా పనిచేసిన దేవాదాయ శాఖకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ మళ్లీ అదే మఠానికి వస్తున్నారనే ప్రచారం జరిగింది. కొంతకాలం తర్వాత ఆ ప్రచారానికి బ్రేక్ పడిందట. వెంటనే పూర్వపు మాజీ మేనేజర్ తిరిగి బాధ్యతలు చేపడతారనే మరో వార్త వినిపించిందట. అది కూడా ఎక్కువ రోజులు నిలవలేదట. ఆ తర్వాత తిరుపతి ఎండోమెంట్ విభాగంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగిని మఠం మేనేజర్‌గా నియమించబోతున్నారనే ప్రచారం మొదలైందని చెబుతున్నారు. అంటే ఒకే పోస్టుకు వరుసగా ఇన్ని పేర్లు ఎలా వచ్చాయి? ప్రతి దశలో నిర్ణయాలు ఎందుకు మారాయి? అసలు తుది నిర్ణయం తీసుకునే ప్రక్రియ ఏమిటి? అన్నదే ఇప్పుడు భక్తుల సందేహం. ఇంతలోనే స్థానికంగా పనిచేస్తున్న ఒక ఉద్యోగి రూ.30 లక్షలతో ఆ పోస్టును దక్కించుకుని తన ప్రయత్నం 'పరిపూర్ణం' చేసుకున్నాడనే ప్రచారం ఊపందుకుందని అంటున్నారు.

### ఐదు కొలువులు.. ఎన్ని బేరాలు.. అసలేం జరిగింది?

ఆ ప్రచారం నిజమైతే ఇది కేవలం ఒక ఉద్యోగి వ్యవహారం కాదు. మఠం పరిపాలనలో పదవుల విలువను డబ్బుతో కొలిచే స్థాయికి వ్యవస్థ దిగజారిందా అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రచారం అబద్ధమైతే.. దానికి బాధ్యులెవరో గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉంటుంది. రెండు పరిస్థితుల్లోనూ మౌనం మాత్రం సమాధానం కాదని భక్తులు అంటున్నారు. మేనేజర్ పోస్టుతో వ్యవహారం ఆగిపోలేదని మరో ప్రచారం వినిపిస్తోంది. మఠంలో ఖాళీగా ఉన్న మరో ఐదు కొలువుల విషయంలోనూ ఇదే తరహాలో బేరసారాలు జరిగాయనే పుకార్లు షికార్లు చేస్తున్నాయట. ఏ పోస్టుకు ఎంత? ఎవరి ద్వారా? ఎవరికి? అన్న లెక్కలు కూడా కొందరు చెబుతున్నారట. ఇవన్నీ వాస్తవాలా? లేక మఠం ప్రతిష్ఠను దెబ్బతీయడానికి కొందరు సృష్టిస్తున్న ప్రచారాలా? అన్నది విచారణ జరిగితేనే తెలుతుంది. కానీ విచారణ లేకుండానే మఠం పేరు చుట్టూ ఇలాంటి ఆరోపణలు తిరుగుతుండటం మాత్రం ఆందోళన కలిగించే విషయమే. ఇదే సమయంలో వేదాలు, వేదమంత్రాలపై కనీస పరిజ్ఞానం లేని వ్యక్తి పండితుడిగా చెలామణి అవుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రకాశం జిల్లా బెస్తవారిపేటకు చెందిన ఒక వ్యక్తి ఇటీవలే పండితుడి హోదాలో మఠంలో చేరినట్టుగా ప్రచారం జరుగుతోంది. పండిత పదవికి అవసరమైన అర్హతలు ఏమిటి? ఆయన విద్యార్హతలు ఏమిటి? వేద విద్యాభ్యాసం ఎక్కడ చేశారు? నియామకానికి ఎలాంటి పరీక్ష లేదా పరిశీలన జరిగింది? అనే ప్రశ్నలకు మఠం యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. అర్హత ఉన్నవారిని పక్కన పెట్టి సిఫారసులతో నియామకాలు జరిగితే అది మఠం సంప్రదాయానికే అవమానమని వారు అంటున్నారు.

### మఠం ప్రతిష్ఠపై పదవుల బేరాల మచ్చ

బ్రహ్మంగారి మఠం అంటే సాధారణ ప్రభుత్వ కార్యాలయం కాదు. అది భక్తుల విశ్వాసంతో ముడిపడిన ఆధ్యాత్మిక క్షేత్రం. అక్కడ ఒక చిన్న తప్పిదం జరిగినా దాని ప్రభావం సాధారణ సంస్థతో పోల్చలేం. అలాంటి చోట ఉద్యోగాల కోసం డబ్బు తీసుకున్నారనే ఆరోపణలు వినిపించడం అత్యంత తీవ్రమైన విషయం. పదవి కోసం డబ్బు ఇచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపై కాకుండా.. డబ్బు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిపైనా విచారణ జరగాలి. బేరం పెట్టినవారు ఎవరో తేలాలి. మధ్యవర్తులు ఎవరో తేలాలి. డబ్బు చేతులు మారిందా లేదా అన్నది తేలాలి. లేకపోతే రేపు మరో పోస్టు కోసం మరో రేటు బయటకు రావడం పెద్ద విషయం కాదని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యమైనది మఠం ప్రతిష్ఠ. వారసత్వ వివాదాలతో ఇప్పటికే తలవంపులు ఎదుర్కొంటున్న ఈ పవిత్ర క్షేత్రానికి ఇప్పుడు ఉద్యోగాల బేరసారాల ఆరోపణలు తోడైతే పరిస్థితి మరింత దిగజారుతుందని అంటున్నారు. ఒకవైపు పీఠాధిపత్యం కోసం కుటుంబాల మధ్య పోరు.. మరోవైపు పరిపాలనా పదవుల కోసం పోటీ.. ఇంకోవైపు డబ్బు బేరాల ప్రచారం.. ఇవన్నీ కలిస్తే భక్తులకు మిగిలేది ఆవేదనే. అందుకే ఆరోపణలను కొట్టిపారేయడం కాకుండా, వాటిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని భక్తులు కోరుతున్నారు. కాలజ్ఞాని శ్రీ వీర బ్రహ్మేంద్రస్వామి సజీవ సమాధి నిష్ఠలో ఉన్నారని.. అక్కడ జరుగుతున్న ప్రతి పరిణామాన్ని ఆయన గమనిస్తారన్నది భక్తుల విశ్వాసం. అందుకే మఠం చుట్టూ వినిపిస్తున్న ఈ ఆరోపణలపై కూడా ఒక నమ్మకం వ్యక్తమవుతోంది. చేసిన తప్పుకు ఎప్పటికైనా ఫలితం ఉంటుందని వారు అంటున్నారు. పదవి కోసం బేరం పెట్టినా.. బేరానికి మధ్యవర్తిత్వం చేసినా.. ముడుపులు తీసుకున్నా.. తీసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొన్నా.. నిజం ఎప్పటికైనా బయటపడుతుందని చెబుతున్నారు.

### రూ.30 లక్షల బేరంపై సమాధానం చెప్పాల్సిందే

ఇప్పుడు మఠం యాజమాన్యం ముందున్నది ఒక్కటే దారి. ఆరోపణలకు సమాధానం చెప్పాలి. మేనేజర్ పోస్టు నియామక ప్రక్రియను బహిర్గతం చేయాలి. ఇతర నియామకాల అర్హతలను వెల్లడించాలి. రూ.30 లక్షల బేరం జరిగిందన్న ప్రచారంపై స్పష్టత ఇవ్వాలి. మరో ఐదు పోస్టుల విషయంలోనూ ఆరోపణలు వినిపిస్తున్నందున వాటిపైనా విచారణ జరపాలి. ఆరోపణలు అబద్ధమైతే వాటిని ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎందుకంటే ఇది కేవలం ఉద్యోగాల వ్యవహారం కాదు. ఇది బ్రహ్మంగారి మఠం ప్రతిష్ఠకు సంబంధించిన వ్యవహారం. పవిత్రతకు ప్రతీకగా నిలవాల్సిన పీఠం.. పదవుల పందేరానికి వేదికగా మారిందనే ముద్ర పడకూడదు. మఠంలో కొలువు అంటే సేవ.. సిఫారసు కాదు. పండిత పదవి అంటే పాండిత్యం.. పరిచయం కాదు. మేనేజర్ బాధ్యత అంటే పరిపాలన.. బేరసారం కాదు. ఈ తేడా చెరిగిపోతే మిగిలేది కేవలం భవనం మాత్రమే.. బ్రహ్మంగారి మఠం అనే పవిత్రత కాదు. అందుకే ఇప్పుడు భక్తుల ప్రశ్న ఒక్కటే... రూ.30 లక్షల బేరం నిజమా? ఐదు కొలువుల రేట్లు నిజంగానే కుదిరాయా? నిజమైతే ఆ డబ్బు ఎక్కడికి వెళ్లింది? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సింది భక్తులు కాదు.. మఠాన్ని నడిపించే బాధ్యతలో ఉన్నవారే.

## ఎన్నారైల బలంతో టీడీపీ గెలుపు

**నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో లోకేశ్**

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సెంట్రల్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్‌ఆర్‌ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ టీడీపీ అధ్యక్షుడిగా డాక్టర్ పి. గురురాజా, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు గంగాధర్ (దీ+) బాధ్యతలు స్వీకరించారు.

**2029 గెలుపే లక్ష్యంగా ముందుకు**

చంద్రబాబు అరెస్ట్‌కు మూడేళ్లు పూర్తైన సందర్భంగా 53 కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలపాలని లోకేశ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధిలో ఎన్నారైలు భాగస్వాములు కావాలని, ఏపీలో పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని కోరారు. ప్రతి ఒక్కరూ పార్టీతో అనుసంధానమై సభ్యత్వం పెంచాలని సూచించారు. 2029 ఎన్నికల్లో ఎన్డీయేను గెలిపించే బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేస్తూ, ప్రపంచ వేదికపై తెలుగుజాతిని నంబర్‌వన్‌గా నిలిపేందుకు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ప్రజా ప్రభుత్వంలో ఎన్నారైల పాత్ర**

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ 2024లో ప్రజా ప్రభుత్వం ఏర్పడటంలో ప్రవాస తెలుగువారి కృషి మరువలేనిదని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ సమయంలో 50 దేశాల్లోని 200 నగరాల్లో ఎన్నారైలు నిరసనలు చేపట్టారని గుర్తుచేశారు. 'ఐయామ్ విత్ సీబీఎన్' కార్యక్రమం క్లిష్ట సమయంలో తమ కుటుంబానికి కొండంత బలాన్నిచ్చిందన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని, ఆయన ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు.




## పేదల నుంచి డబ్బు వసూలు

**అక్రమ వసూళ్లు తిరిగి ఇప్పించిన కమిషనర్**

ప్రొద్దుటూరులో పేదల నుంచి అక్రమంగా వసూలు చేసిన నగదును మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తిరిగి ఇప్పించారు. వాట్సాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదుపై వెంటనే స్పందించిన కమిషనర్ ఆకస్మికంగా విచారణ చేపట్టి బాధిత లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హులైనప్పటికీ పింఛన్ అందని వారి వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 16 వరకు అవకాశం కల్పించింది. ఇదే అవకాశాన్ని ఆసరాగా చేసుకుని 7వ వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్ చెన్న సుదర్శన్ పది మంది లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.200 చొప్పున వసూలు చేసినట్లు విచారణలో తేలిందని కమిషనర్ తెలిపారు. దీంతో సిబ్బందితో కలిసి బాధితుల ఇళ్లకు వెళ్లి వసూలు చేసిన మొత్తం నగదును తిరిగి ఇప్పించారు. సిబ్బంది చేసిన తప్పిదానికి లబ్ధిదారులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. సుదర్శన్‌కు వివరణ కోరుతూ తాఖీదు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల పేరుతో పేదల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు, అవసరమైతే క్రిమినల్ కేసులు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాల కోసం ఎవరూ డబ్బులు చెల్లించవద్దని, అక్రమ వసూళ్లు జరిగితే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషనర్ చర్యలను స్థానికులు అభినందించారు.

## మదనాపూర్ ఠాణాలో ఎస్పీ తనిఖీ

**గణేష్ నిమజ్జన ప్రాంతాల్లో భద్రతపై ఆరా**



మదనాపూర్ పోలీస్ స్టేషన్‌ను వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, సీసీ కెమెరాల పనితీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. బాధితులతో పారదర్శకంగా వ్యవహరిస్తూ పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెంచేలా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండలంలోని గణేష్ నిమజ్జన ప్రదేశాలైన సరళసాగర్, రామన్‌పాడ్, కొత్తపల్లి బ్రిడ్జ్ ప్రాంతాలను ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## రాజంపేటలో జనసేన బలోపేతంపై ఫోకస్

**శివశంకర్‌తో యల్లటూరు కీలక భేటీ**

రాజంపేట పార్లమెంట్ పరిధిలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంపై కీలక చర్చ జరిగింది. పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జనసేన నేతలు రాష్ట్ర ఎంఎస్ఎంఈ చైర్మన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట పార్లమెంట్ పరిధిలో పార్టీ విస్తరణ, రానున్న రాజకీయ పరిణామాలు, ప్రజల్లో జనసేనకు మరింత ఆదరణ పెంచే కార్యాచరణపై నేతలు విస్తృతంగా చర్చించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పార్టీ తరపున కృషి చేయడం, అభివృద్ధి కార్యక్రమాల్లో జనసేన పాత్రను మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లడంపై కూడా చర్చ జరిగినట్లు నేతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత చేరువయ్యేలా పార్టీ కార్యక్రమాలను విస్తరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ భేటీలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు, జనసేన నేత యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ పాల్గొన్నారు. రాజంపేటలో జనసేనకు సంస్థాగతంగా బలం చేకూర్చడమే లక్ష్యంగా నేతలు సమన్వయంతో సాగాలని నిర్ణయించినట్లు సమాచారం.

## కేసీఆర్‌పై వ్యాఖ్యలు.. ఎమ్మెల్యేపై ఫిర్యాదు

**షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలకు బీఆర్ఎస్ డిమాండ్**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్‌నగర్ ఎమ్మెల్యే కె. శంకరయ్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. కేసీఆర్ మరణాన్ని కోరుతూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారంటూ రేవల్లి పోలీసులకు ఫిర్యాదు అందింది. బీఆర్ఎస్ మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఎస్ఐ రజితను కలిసి ఫిర్యాదు చేశారు. సెప్టెంబర్ 8న ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో శంకరయ్య "కేసీఆర్ చావాలి.. అందుకే వెయ్యి డప్పులతో ర్యాలీ చేస్తున్నాం" అంటూ బహిరంగంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతల ప్రేరణతోనే ఎమ్మెల్యే ఈ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు కేసీఆర్ ప్రాణ భద్రతకు ముప్పు కలిగించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత–2023లోని 196, 351(3), 352, 353, 61 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.






# బొత్స వారసత్వం కూతురుకా.. కొడుక్కా?

## చిన్నగా మేనల్లుడు ఎగరేసుకుపోతాడా

## కళింగ రాజ్యంలో మామా అల్లుళ్ల సవాల్




### బొత్స రాజకీయాలకు మేనల్లుడు సవాల్

రాజకీయాల్లో వారసత్వం ప్రకటించడం ఒక విషయం. ఆ వారసత్వాన్ని క్షేత్రస్థాయిలో బలమైన రాజకీయ శక్తిగా మార్చడం మరో విషయం. బొత్సకు ఈ తేడా బాగా తెలుసు. అందుకే అనూషను ఇప్పటి నుంచే పార్టీ కార్యక్రమాల్లోకి తీసుకువస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమెను జిల్లా పరిషత్ రాజకీయాల్లోకి తీసుకురావాలన్న ఆలోచన కూడా బొత్సకు ఉన్నట్లు గతంలోనే వార్తలు వచ్చాయి. అంటే బొత్స తన రాజకీయ జీవితానికి తర్వాత కుటుంబంలోనే ఒక బలమైన రాజకీయ కేంద్రాన్ని తయారు చేసుకోవాలని చూస్తున్నారన్నది స్పష్టమవుతోంది. కానీ అదే సమయంలో చిన్న శ్రీను కూడా రాజకీయంగా తన కుటుంబాన్ని ముందుకు తీసుకెళ్లాలనుకోవడం మొదలైతే? ఇదే విజయనగరం రాజకీయాల్లో అసలు మలుపు. చిన్న శ్రీను తన కుమార్తె సిరి సహస్రతో కలిసి టీడీపీలో చేరడం అందుకే ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రెండు కుటుంబాల వారసత్వ రాజకీయాలు ఒకదానికొకటి ఎదురుగా నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. బొత్స కుమార్తె అనూష ఒకవైపు ఉంటే, చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర మరోవైపు నిలబడే అవకాశాలపై జిల్లాలో చర్చ మొదలైంది. ఈ పోటీ ఇప్పుడు వ్యక్తిగత విభేదాల స్థాయిని దాటి రెండు రాజకీయ శిబిరాల మధ్య పోటీగా మారే అవకాశం ఉంది. చిన్న శ్రీను వైసీపీని వీడటానికి అసలు కారణం ఏమిటన్నదానిపై అధికారికంగా ఒకే కారణం చెప్పలేం. రాజకీయ వర్గాల్లో మాత్రం బొత్స కుటుంబ వారసత్వ అంశమే ప్రధాన కారణమన్న చర్చ నడుస్తోంది.

విజయనగరం జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ఒక్కటే ప్రశ్న. ఇన్నాళ్లు ఒకే కుటుంబం చుట్టూ తిరిగిన రాజకీయ చక్రం ఇక ఎటు తిరుగుతుంది? దశాబ్దాలుగా బొత్స సత్యనారాయణ నిర్మించుకున్న రాజకీయ వ్యవస్థకు అసలు వారసుడు ఎవరు? రక్త సంబంధంలో కొడుకా, కూతురా? రాజకీయ అనుభవంలో మేనల్లుడా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పేంతలోనే ఒక కీలక పరిణామం జరిగిపోయింది. బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. ఆయనతో పాటు కుమార్తె సిరి సహస్ర కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ చేరికతో ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఇది ఒక నాయకుడు పార్టీ మారిన సాధారణ రాజకీయ పరిణామం కాదు. ఎందుకంటే చిన్న శ్రీను కేవలం వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా మాత్రమే ఉండలేదు. బొత్స సత్యనారాయణకు చాలా కాలంగా అత్యంత సన్నిహితంగా పనిచేసిన మేనల్లుడిగా, విజయనగరం జిల్లా రాజకీయాలను లోతుగా అర్థం చేసుకున్న నాయకుడిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఒకప్పుడు బొత్స రాజకీయ వ్యవస్థలో కీలకంగా పనిచేసిన చిన్న శ్రీను, కాలక్రమంలో జిల్లాలో స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగారు. అందుకే ఆయన పార్టీ మార్పు వైసీపీకి నష్టం ఎంత అన్నదానికంటే, బొత్స కుటుంబ రాజకీయాలకు ఎదురైన సవాలు ఎంత అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం ఒక్క విజయనగరం జిల్లాకే పరిమితమైనది కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల నుంచి నేటి ఉత్తరాంధ్ర రాజకీయాల వరకు ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేసిన ఆయనకు రాజకీయ వ్యవస్థలపై మంచి పట్టు ఉంది. ఆయన కుటుంబం కూడా రాజకీయాల్లో చురుగ్గా ఉంది. భార్య బొత్స ఝాన్సీ లక్ష్మి గతంలో ఎంపీగా పనిచేశారు. ఇప్పుడు మరో తరం రాజకీయాల్లోకి రావడానికి బొత్స కుమార్తె అనూషను సిద్ధం చేస్తున్నారు. ఆగస్టులోనే అనూషను తన రాజకీయ వారసురాలిగా బొత్స ప్రకటించడంతో విజయనగరం రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.

### ప్రత్యర్థి వ్యూహకర్తగా చిన్న శ్రీను మంత్రాంగం

అయితే రాజకీయాల్లో కారణం కంటే ఫలితం ముఖ్యం. ఆ ఫలితం మాత్రం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇన్నాళ్లు బొత్సతో కలిసి పనిచేసిన చిన్న శ్రీను ఇప్పుడు బొత్సకు ప్రత్యర్థి శిబిరంలో నిలబడ్డారు. అంటే బొత్స కుటుంబం నిర్మించుకున్న రాజకీయ వ్యవస్థకు బయట నుంచి ఎవరో వచ్చి సవాలు చేయడం కాదు. ఆ వ్యవస్థలోనే సంవత్సరాల పాటు పెరిగిన ఒక కీలక నాయకుడు ఇప్పుడు మరో రాజకీయ వేదికపై నిలబడి సవాలు విసురుతున్నాడు. ఇదే ఈ పరిణామానికి ఉన్న అసలు బలం. చిన్న శ్రీనుకు ఉన్న మరో బలం ఆయనకు జిల్లా రాజకీయాలపై ఉన్న అవగాహన. ఏ మండలంలో ఎవరి ప్రభావం ఉంది? ఏ నియోజకవర్గంలో ఏ సామాజిక సమీకరణ పనిచేస్తుంది? ఎవరిని కలుపుకోవాలి? ఎవరిని దూరంగా ఉంచాలి? ఏ ఎన్నికలో ఏ అంశాన్ని ముందుకు తేవాలి? ఇలాంటి విషయాల్లో ఆయనకు దీర్ఘకాల అనుభవం ఉంది. బొత్స రాజకీయ పాఠశాలలోనే ఎదిగిన నాయకుడిగా ఆయనకు ఆ అనుభవం వచ్చింది. అందుకే బొత్స శిబిరంలో ఒకప్పుడు వ్యూహాత్మకంగా పనిచేసిన వ్యక్తి ఇప్పుడు అదే జిల్లాలో ప్రత్యర్థి వ్యూహాన్ని రూపొందించాల్సి రావడం ఆసక్తికరమైన రాజకీయ పరిణామం. ఇక్కడే టీడీపీకి కూడా అసలు లెక్క ఉంది. ఒకప్పుడు వైసీపీకి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిని పార్టీలోకి తీసుకోవడం ద్వారా టీడీపీకి కేవలం ఒక నాయకుడు చేరలేదు. ఒక పూర్తి రాజకీయ నెట్‌వర్క్ చేరే అవకాశం ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఇది టీడీపీకి సంస్థాగతంగా ఉపయోగపడే పరిణామం. అయితే చిన్న శ్రీను టీడీపీలో చేరడం అంతటితో కథ ముగియదు. అసలు పరీక్ష అక్కడి నుంచే మొదలవుతుంది. వైసీపీ నుంచి బయటకు రావడం ఒక నిర్ణయం. టీడీపీలో కొత్తగా తన రాజకీయ స్థావరాన్ని నిర్మించుకోవడం మరో నిర్ణయం. ఇన్నాళ్లు బొత్స రాజకీయ వ్యవస్థలో పనిచేసిన నాయకుడు ఇప్పుడు టీడీపీ వ్యవస్థలో తనకు సొంత స్థానం ఏర్పరుచుకోవాలి. స్థానిక టీడీపీ నేతలతో సమన్వయం చేసుకోవాలి. టీడీపీలో తన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకోవాలి.

### బొత్సకు పరీక్ష కాలం.. చిన్న శ్రీనుకు కొత్త బలం

ఇదే సమయంలో బొత్సకు కూడా ఇది చిన్న పరీక్ష కాదు. ఇప్పటివరకు తన రాజకీయ వ్యవస్థలో కీలకంగా ఉన్న వ్యక్తి బయటకు వెళ్లాడు. ఇక మిగిలిన నాయకత్వాన్ని ఏ విధంగా పునర్వ్యవస్థీకరిస్తారు అన్నదే ముఖ్యం. ముఖ్యంగా అనూషను ఎంత వేగంగా క్షేత్రస్థాయిలో నిలబెట్టగలరు అన్నది కీలకం. ఒక రాజకీయ కుటుంబంలో వారసత్వాన్ని ప్రకటించడం సులువు. కానీ ఆ వారసుడికి కార్యకర్తలతో సంబంధం, నియోజకవర్గ స్థాయి పరిచయాలు, స్థానిక నాయకులతో సమన్వయం, ఎన్నికల నిర్వహణ అనుభవం రావడానికి సమయం పడుతుంది. అనూషకు ఆ రాజకీయ ప్రయాణం ఇప్పుడే మొదలైంది. అందుకే 'చిన్న శ్రీను వెళ్లిపోయాడు కాబట్టి బొత్స రాజకీయాలు ముగిసిపోయాయి' అని చెప్పడం ఎంత తొందరపాటు నిర్ణయమో, 'బొత్స కుటుంబం ఉన్నంతకాలం చిన్న శ్రీను ఎదగలేడు' అనడం కూడా అంతే పొరపాటు. ఇద్దరికీ వేర్వేరు బలాలు ఉన్నాయి. బొత్సకు దశాబ్దాల రాజకీయ అనుభవం, కుటుంబ రాజకీయ నేపథ్యం, రాష్ట్రస్థాయి పరిచయాలు ఉన్నాయి. చిన్న శ్రీనుకు జిల్లా స్థాయి సంస్థాగత అనుభవం, వ్యక్తిగత పరిచయాలు, స్థానిక రాజకీయాలపై పట్టు ఉన్నాయి. ఇక ఇద్దరూ వేర్వేరు పార్టీల్లో ఉండటం వల్ల ఈ బలాలు నేరుగా ఢీకొనే అవకాశం ఏర్పడింది. మరో ముఖ్యమైన అంశం సామాజిక సమీకరణాలు. విజయనగరం రాజకీయాల్లో కేవలం వ్యక్తిగత సంబంధాలు ఎన్నికల ఫలితాలను నిర్ణయించవు. కుల, ప్రాంత, స్థానిక నాయకత్వ సమీకరణాలు కూడా కీలకం. టీడీపీ ఇప్పటికే ఉత్తరాంధ్రలో తన సంస్థాగత బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది.

### చిన్న శ్రీనుకు టీడీపీ కొత్త రాజకీయ భవిష్యత్

ఇక చిన్న శ్రీనుకు టీడీపీ ఎలాంటి రాజకీయ భవిష్యత్తు ఇస్తుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్న. ఆయనకు ఎమ్మెల్యే స్థాయి అవకాశం ఇస్తారన్న ప్రచారం వినిపిస్తోంది. కుమార్తె సిరి సహస్రకు విజయనగరం మేయర్ పదవి లేదా జిల్లా పరిషత్ స్థాయిలో కీలక అవకాశం కల్పిస్తారన్న చర్చ కూడా ఉంది. అయితే ఇవి ప్రస్తుతానికి అధికారికంగా ఖరారైన నిర్ణయాలుగా కనిపించడం లేదు. కొన్ని రాజకీయ కథనాల్లో మాత్రం సిరి సహస్రకు జడ్పీ ఛైర్‌పర్సన్ అవకాశం గురించి కూడా ప్రచారం వచ్చింది. కాబట్టి ఈ హామీలను ఖరారైన పదవులుగా కాకుండా టీడీపీలో చేరికకు సంబంధించి జరుగుతున్న రాజకీయ చర్చగా చూడటం సముచితం. అయితే టీడీపీ నాయకత్వం నిజంగానే చిన్న శ్రీనుకు, ఆయన కుమార్తెకు కీలక బాధ్యతలు అప్పగిస్తే దాని రాజకీయ సందేశం మరింత స్పష్టమవుతుంది. అది కేవలం ఒక వలసను ప్రోత్సహించడం కాదు. బొత్స రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అదే కుటుంబం నుంచి విడిపోయిన ఒక శక్తిని ప్రత్యామ్నాయ కేంద్రంగా తయారు చేయడం అవుతుంది. రాజకీయాల్లో ప్రత్యర్థి బలాన్ని తగ్గించడానికి అతని వ్యూహాలను తెలిసిన వ్యక్తిని తన వైపు తిప్పుకోవడం అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటి. టీడీపీకి చిన్న శ్రీను చేరికలో కనిపిస్తున్న రాజకీయ విలువ ఇదే.

### విజయనగరంలో రెండు తరాల కొత్త పోరు

అయితే అసలు సవాలు ఒక్క అనూషకు మాత్రమే కాదు. బొత్స కుటుంబంలో మిగిలిన రాజకీయ వారసత్వం కూడా పరీక్షకు వస్తుంది. బొత్స కుమారుడు డాక్టర్ లక్ష్మీనారాయణ్ సందీప్ రాజకీయాల్లోకి రావడంపై ఆసక్తి తక్కువగా ఉందన్న వార్తలు గతంలో వచ్చాయి. అందుకే అనూషనే రాజకీయ వారసురాలిగా ముందుకు తీసుకువస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను కూడా తన కుమార్తె సిరి సహస్రను రాజకీయంగా ముందుకు తీసుకువస్తే, విజయనగరం రాజకీయాల్లో ఒకే కుటుంబానికి చెందిన రెండు తదుపరి తరాలు ప్రత్యర్థి శిబిరాల్లో నిలిచే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం మామా అల్లుళ్ల గొడవగా చూడటం కూడా సరికాదు. ఇది వారసత్వ రాజకీయాల స్వరూపాన్ని మార్చే పరిణామం కావచ్చు. ఒక కుటుంబం తరతరాలుగా నిర్మించిన రాజకీయ ప్రభావాన్ని రక్త సంబంధం ఆధారంగా ఎవరు స్వీకరిస్తారు? లేక ఆ రాజకీయ వ్యవస్థలో సంవత్సరాల పాటు పనిచేసి ఎదిగిన వ్యక్తి దానిలో తన వాటాను వేరే రూపంలో నిర్మించుకుంటారా? విజయనగరం ఇప్పుడు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పబోతోంది. చిన్న శ్రీను వైసీపీని వీడి టీడీపీలో చేరడం వల్ల వైసీపీకి సంస్థాగతంగా దెబ్బ తగిలింది అనడంలో సందేహం లేదు. కానీ దీని ప్రభావం ఎంతవరకు ఉంటుందో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే తేల్చాలి. వ్యక్తిగత ప్రభావం ఓట్లుగా మారుతుందా? అనుచరులు మొత్తం వెంట వస్తారా? లేక కొంతమంది మాత్రమే వస్తారా? టీడీపీ ఇప్పటికే ఉన్న నిర్మాణంతో చిన్న శ్రీను బలం ఎలా కలుస్తుంది? ఇవన్నీ ఇంకా సమాధానం లేని ప్రశ్నలే.

### బొత్స కోటకు చిన్న శ్రీను డైరెక్ట్ సవాల్

అదే సమయంలో బొత్స శిబిరానికి కూడా ఇప్పుడు ఒక స్పష్టమైన సందేశం వెళ్లింది. నాయకత్వాన్ని వారసత్వంగా ప్రకటించడం సరిపోదు. దాన్ని క్షేత్రస్థాయిలో నిరూపించాలి. చిన్న శ్రీను లాంటి నాయకుడు ఒకప్పుడు బొత్స రాజకీయ వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాడు. ఇప్పుడు అదే నాయకుడు ప్రత్యర్థి శిబిరంలో నిలబడ్డాడు. అంటే బొత్స కుటుంబం ముందు ఉన్న అసలు పని ప్రత్యర్థిని విమర్శించడం కాదు. తమ రాజకీయ వ్యవస్థలో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడం. అందుకే ఇప్పుడు విజయనగరం రాజకీయాల్లో అసలు పోరు 'బొత్స వర్సెస్ చిన్న శ్రీను'గా మొదలై, 'అనూష వర్సెస్ సిరి సహస్ర'గా తదుపరి దశకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది. ఇది ఇప్పటికీ ఒక రాజకీయ అంచనా మాత్రమే. కానీ ప్రస్తుత పరిణామాలు ఆ దిశగా సంకేతాలు ఇస్తున్నాయి. ఇన్నాళ్లు బొత్స నిర్మించుకున్న కోటలో చిన్న శ్రీను ఒక కీలక స్తంభం. ఆ స్తంభం ఇప్పుడు బయటకు వచ్చి తనకంటూ మరో కోట నిర్మించుకోవడానికి సిద్ధమయ్యారు. అయితే పాత కోటను కూల్చగలరా? కొత్త కోటను నిర్మించగలరా? అనేది కాలమే నిర్ణయించాలి. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. చిన్న శ్రీను టీడీపీలోకి వెళ్లడం ద్వారా విజయనగరం రాజకీయాల్లో గీత మారింది. బొత్స కుటుంబ రాజకీయాలకు ఇక నుంచి సవాలు బయట నుంచి మాత్రమే రాదు. పక్కనే ఉన్న రాజకీయ అనుభవం నుంచి కూడా వస్తుంది. అంతిమంగా ఇది ఒక మేనల్లుడు మామకు ఇచ్చిన రాజకీయ షాక్ మాత్రమే కాదు. ఒక తరం నుంచి మరో తరానికి రాజకీయ వారసత్వం మారుతున్న సమయంలో ఏర్పడిన సహజ సంఘర్షణ.

### జిల్లా పీఠం కోసం మామా అల్లుళ్ల సమరం

బొత్స తన కూతురిని వారసురాలిగా తయారు చేయాలనుకుంటున్నారు. చిన్న శ్రీను తన కుమార్తెకు భవిష్యత్తు వెతుక్కుంటున్నారు. రెండు కుటుంబాల లక్ష్యం ఒకటే.. విజయనగరం రాజకీయాల్లో తమ ప్రభావాన్ని నిలబెట్టుకోవడం. మారింది కేవలం వేదిక. ఇప్పటి వరకు బొత్స నీడలో నడిచిన చిన్న శ్రీను ఇక సొంత నీడను తయారు చేసుకోవాల్సిన దశకు వచ్చారు. బొత్స కూడా తన కుటుంబ వారసత్వాన్ని మాటల నుంచి మైదానంలోకి తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చింది. ఎవరి రాజకీయ బలం ఎంత? ఎవరి వెంట ఎంతమంది వస్తారు? ఎవరు కార్యకర్తలను నిలబెట్టుకుంటారు? ఎవరు ఎన్నికల యంత్రాంగాన్ని నడిపిస్తారు? అన్నదే అసలు పరీక్ష. అందుకే విజయనగరం రాజకీయాల్లో ఇక ప్రశ్న ఒక్కటే కాదు. బొత్స వారసత్వం కూతురు చేతికి వెళుతుందా? లేక ఇన్నాళ్లు ఆ వారసత్వానికి అండగా నిలిచిన మేనల్లుడు దానిలో తన వాటాను ఎగరేసుకుపోతాడా? సమాధానం ఇప్పుడే చెప్పడం తొందరపాటు. కానీ ఆట మొదలైంది. మామా--అల్లుళ్ల మధ్య వ్యక్తిగత బంధం రాజకీయంగా తెగిపోయిన చోట, రెండు రాజకీయ భవిష్యత్తులు పరస్పరం ఢీకొనే కొత్త అధ్యాయం మాత్రం మొదలైంది.






# చనిపోయాక కూడా తీరని అప్పు

## గొంతులేని అమెరికా బతుకుల నిజాలు

## పద్మవ్యూహంలో అభిమన్యులు

### ఆధునిక అమెరికా జీవితం



A for అప్పు
ME for మేమే
RI for రిపే చేయాలి
CA for కాలం చేసి



#### #చనిపోయాక కూడా తీరని అప్పు

గత అయిదేళ్లలో అమెరికాలో ఎంతోమంది స్టూడెంట్స్ యాక్సిడెంట్ల వల్ల, హెల్త్ ప్రాబ్లమ్స్ వల్ల చనిపోయారు. అప్పటికీ లోన్ బ్యాలెన్స్ మిగిలే ఉంటుంది. బ్యాంకులు ఊరుకోవటం లేదు "చచ్చిపోతే మాకేం సంబంధం, మీరు కట్టండి" అని తల్లిదండ్రుల గడప తొక్కుతున్నారు, లేదంటే మీరు ష్యూరిటీ పెట్టిన ప్రాపర్టీని జప్తుచేస్తాం అని బెదిరిస్తున్నారు. బిడ్డని పోగొట్టుకుని సగం చనిపోయిన తల్లిదండ్రులని, మిగిలిన సగాన్ని మన బ్యాంకింగ్ సిస్టమే చావుదాకా తీసుకెళ్తుంది, లోన్ అమౌంట్ కోసం. వ్యూహంలో చిక్కుకున్నవాడు చనిపోయినా, వ్యూహం అతని కుటుంబాన్ని వదలదు. అదే వ్యవస్థ మరోవైపు ఎంత మెతకగా ఉంటుందో చూడాలంటే, పార్లమెంట్లో వెల్లడైన లెక్కల ప్రకారం, 15 మంది Fugitive Econom ic Offenders కలిపి బ్యాంకులకు రూ. 58,082 కోట్లు బాకీ పడితే, ఇప్పటిదాకా వసూలైంది కేవలం మూడో వంతు మాత్రమే. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ లాంటి కేసులు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. కానీ సాధారణ విద్యార్థి చనిపోతే మాత్రం బ్యాంకు EMI ఆగదు. వ్యవస్థ పెద్దవాళ్ల ముందు నెమ్మదిగా నడుస్తుంది, చిన్నవాళ్ల ముందు మాత్రం పరుగెడుతుంది.
ఇదే ఈ వ్యవస్థ చూపించే న్యాయం, సామాన్యుడి మీద.

#### #ఉద్యోగం, AI, నిజం

మాస్టర్స్ పూర్తయ్యాక ఒకప్పుడు మొదటి ఉద్యోగమే పెద్ద పరీక్ష. ఇప్పుడు మొదటి ఉద్యోగమే కనిపించడం లేదు. OPT, STEM OPT, H1B... ఏ స్టేటస్‌లో ఉన్నా వేల మంది పార్ట్‌టైమ్‌లతోనే బతుకుతున్నారు.
"ఈ ఎడ్యుకేషన్ లోన్ ఒక్కసారి తీరిపోతే చాలు దేవుడా, ఇండియా వెళ్లిపోతాను" అనుకునేవాళ్లు లక్షల్లో ఉన్నారంటే అది అతిశయోక్తి కాదు. అమెరికాలో చదువుకున్నవాడికి ఉద్యోగం లేదు, ఉద్యోగం ఉన్నవాడికి స్థిరత్వం లేదు, స్థిరత్వం ఉన్నవాడికి సంపాదన మరియు సుఖం లేదు. ఈ పరిస్థితికి ఇప్పుడు మరో కనిపించని ప్రత్యర్థి చేరాడు—AI. జూనియర్ డెవలపర్, టెస్టర్, ఎంట్రీలెవెల్ ఇంజనీర్... కెరీర్ మొదటి మెట్లనే AI ప్రభావితం చేస్తోంది. 2026లో నిర్వహించిన సర్వేలో 89% మంది గ్రాడ్యుయేట్లు AI తమ మొదటి ఉద్యోగాన్ని ప్రభావితం చేస్తుందని భావించారు. World Economic Forum ప్రకారం కూడా అనేక కంపెనీలు AI వల్ల workforce తగ్గించాలని చూస్తున్నాయి. ఒకప్పుడు మెట్లు ఎక్కడం కష్టం. ఇప్పుడు మొదటి మెట్టే కనిపించడం లేదు.

#### #ఓటు లేని వాళ్లం

గత రెండేళ్లుగా ట్రంప్ ఇమ్మిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తున్నాడు. వీసాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు అన్నీ అనిశ్చితంగా మారాయి. కానీ లోతుగా చూస్తే ఇది అమెరికా రాజకీయాల లెక్కే. ఓటు హక్కు ఉన్నవాళ్లకే రాజకీయ విలువ ఉంటుంది. వలస వచ్చినవాళ్లు టాక్స్ పేయర్లు కావచ్చు, కానీ ఓటర్లు కాదు. సరిగ్గా ఇదే లెక్క మన భారతీయ రాజకీయాల్లో కూడా కనిపిస్తుంది. అమెరికాకు వెళ్లిన విద్యార్థి, ఉద్యోగి, వలసదారుడు—వాళ్లు ఇక్కడ ఓటు వేయడానికి రారు. అందుకే ఎడ్యుకేషన్ లోన్ వడ్డీల గురించి, విదేశాల్లో విద్యార్థుల మరణాల తర్వాత కుటుంబాలు ఎదుర్కొనే బ్యాంకుల వేధింపుల గురించి, వలసదారుల సమస్యల గురించి మన నాయకులు పెద్దగా మాట్లాడరు. తేడా ఒక్కటే. ట్రంప్ చేస్తే విమర్శిస్తాం. మనవాళ్లు అదే చేస్తే మౌనంగా అంగీకరిస్తాం. చాలామంది ఒక మాట అంటారు.. "మీరు కట్టే టాక్స్‌తోనే అమెరికా ఇంత బాగా నడుస్తోంది" అని. అది సగం నిజం మాత్రమే. టాక్స్ కట్టేవాడు ఇండియనా, చైనీసా, మెక్సికనా, అమెరికనా అని ప్రభుత్వం చూడదు. ఆదాయం ఉంటే టాక్స్ కట్టాల్సిందే. కానీ పాలసీలు నిర్ణయించే సమయంలో మీ గొంతు వినిపించదు. ఓటు లేదు. ప్రాతినిధ్యం లేదు. అవసరమైతే ఒక్క ఉద్యోగం పోవడంతోనే దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి మీది. టాక్స్ మాత్రం పూర్తిగా కట్టాలి. ఆ రోడ్లు, ఆ డ్రైనేజీ, ఆ వ్యవస్థ మీ కోసం ప్రత్యేకంగా నిర్మించలేదు. మీరు లేకపోయినా ఇంకెవరో వచ్చి అదే టాక్స్ కట్టేవారు. ఈ వ్యవస్థకు కావాల్సింది మీ వ్యక్తిత్వం కాదు—మీ టాలెంట్, మీ డబ్బు. అవి ఉన్నంతవరకే స్వాగతం. ఆగిపోయిన రోజు "Your role has been eliminated" అనే ఒక్క ఇమెయిల్ చాలు.
ఒక్కసారి ఊహించండి. రేపు అమెరికా ప్రభుత్వం "మీరు ఇన్నేళ్లు కట్టిన టాక్స్ అంతా తిరిగి ఇచ్చేస్తాం. ఇప్పుడు మీ దేశానికి వెళ్లిపోండి" అంటే? ఎయిర్‌పోర్ట్‌లో నిలబడటానికి కూడా చోటు ఉండదు. ఎందుకంటే మనం ఇక్కడ ఉండటానికి కారణం టాక్స్ కాదు..భవిష్యత్తు. ఇక్కడ ఇంకో పోలిక ఉంది. ఇండియాలో ఇన్‌కమ్ టాక్స్ కట్టకపోయినా ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉంటుంది. అమెరికాలో టాక్స్ కట్టినా వలసదారుడికి ఆ హక్కు ఉండదు. మంచి రోడ్లు, శుభ్రమైన వ్యవస్థ, మెరుగైన సౌకర్యాలు ఇవన్నీ గొప్పవే. కానీ అవి రాజకీయ స్వరానికి ప్రత్యామ్నాయం కావు. జైల్లో ఖైదీకి తిండి, మంచం, వైద్యం ఉంటాయి. అంత మాత్రాన అతనికి స్వేచ్ఛ ఉన్నట్టేనా?
ఇండియాలో అమ్మానాన్న ఏదైనా అంటే ఎదురు మాట్లాడే ధైర్యం చాలా మందికి. కానీ ఇక్కడ ప్రాజెక్ట్ మేనేజర్ ఒక మాట అంటే చాలాసార్లు మౌనంగా తలూపాల్సి వస్తుంది. బహుశా, సొంతింట్లో ప్రేమ ఉంటుంది. పరాయి దేశంలో ఒప్పందం ఉంటుంది. ప్రేమ కాదు ఇది... లావాదేవీ.

#### # లోపలికి వెడల్పు, బయటికి ఇరుకు

పద్మవ్యూహంలోకి వెళ్లే దారి ఎప్పుడూ వెడల్పుగానే ఉంటుంది. బయటికి వచ్చే దారి మాత్రం నెమ్మదిగా ఇరుకవుతూ ఉంటుంది. అమెరికా విద్యార్థి వ్యవస్థ కూడా అలాగే మారుతోంది. 201516లో అమెరికాలో సుమారు 1.66 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉండగా, 202425 నాటికి ఆ సంఖ్య 3.63 లక్షలకు చేరింది. చైనాను దాటి, అమెరికాకు అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులను పంపుతున్న దేశంగా ఇప్పుడు ఇండియానే నిలిచింది. అంటే లోపలికి వచ్చే ద్వారం ఇప్పటికీ వెడల్పుగానే ఉంది. కానీ చదువు పూర్తయ్యాక కనిపించే దారి మాత్రం పూర్తిగా వేరే కథ చెబుతోంది. ఒకప్పుడు వేల సంఖ్యలో H1B ఉద్యోగాలకు అవకాశం కల్పించిన భారతీయ IT కంపెనీల కొత్త H1B ఆమోదాలు గత దశాబ్దంలో భారీగా తగ్గిపోయాయి. ఉద్యోగాల కోసం పోటీ పెరిగింది, గ్రీన్ కార్డ్ కోసం వేచి చూసే కాలం పెరిగింది, స్థిరపడే దారి మరింత ఇరుకైంది. ఇక్కడే అసలు వ్యూహం కనిపిస్తుంది. లోపలికి ఎక్కువ మందిని ఆహ్వానిస్తారు, ఎందుకంటే ప్రతి అంతర్జాతీయ విద్యార్థి యూనివర్సిటీలకు ట్యూషన్ ఫీజుల రూపంలో ఆదాయం. 2024 25లో అంతర్జాతీయ విద్యార్థులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు 42.9 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక ప్రభావం తీసుకొచ్చారు. కానీ అదే విద్యార్థి చదువు పూర్తయ్యాక ఎదుర్కొనేది అనిశ్చిత ఉద్యోగ మార్కెట్, H1B లాటరీ, సంవత్సరాల గ్రీన్ కార్డ్ నిరీక్షణ.
వ్యూహం ఎప్పుడూ ఖడ్గాలతోనే ఉండదు. కొన్నిసార్లు అది అడ్మిషన్ లెటర్ రూపంలో వస్తుంది. స్టూడెంట్ లోన్ రూపంలో వస్తుంది. OPT రూపంలో వస్తుంది. H1B లాటరీ రూపంలో వస్తుంది. లోపలికి రావడం సులభం. బయటికి గెలిచి రావడం కష్టం.

#### # నిజాల నీడలో బతుకు కథలు

మనిషి చనిపోతే దాన్ని "మరణం" అంటారు. కానీ కొందరు చనిపోకుండానే ప్రతిరోజూ కొంచెం కొంచెంగా చనిపోతుంటారు. వాళ్లను అమెరికాలో "మాస్టర్స్ విద్యార్థి" అంటారు, "వలసదారుడు" అంటారు, "అప్పున్నవాడు" అంటారు. చావు ఒక్కసారే వస్తుంది. కానీ ఈ చావు వాయిదాల్లో వస్తుంది ..EMIలా. 2018 నుంచి 2024 వరకు విదేశాల్లో 842 మంది భారతీయ విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అందులో అత్యధికంగా 141 మంది అమెరికాలోనే. లెక్కల్లో ఇవి కేవలం సంఖ్యలు. కానీ ప్రతి సంఖ్య వెనుక ఒక తల్లి ఒడిలో ఖాళీ ఉంది, ఒక తండ్రి జీవితాంతం మోయాల్సిన నిశ్శబ్దం ఉంది. ఆ ఖాళీని ఏ డాలర్ నింపలేదు, ఏ కరెన్సీ పూడ్చలేదు. కొన్ని నెలల క్రితం IIT మద్రాస్ నుంచి బర్కిలీ వరకు చేరిన ఒక యువకుడు చదువులో గెలిచాడు. కానీ మనసులో ఓడిపోయాడు. ఎందుకంటే డిగ్రీలు గుండెని కాపాడవు. సర్టిఫికెట్లు నిద్రని ఇవ్వవు.

దేశంలో అప్పుల భారంతో ప్రాణాలు తీసుకునేవారి సంఖ్య కూడా ఏటేటా పెరుగుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు. కుటుంబాలను, కలలను, భవిష్యత్తులను మెల్లగా మింగేస్తున్న నిశ్శబ్ద సంక్షోభం. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... వ్యూహం అంటే యుద్ధభూమి మాత్రమే కాదు. వ్యూహం అంటే ఈ లెక్కలు కూడా. ప్రతి కోటాలో, ప్రతి ఇంటర్వ్యూలో, ప్రతి లోన్ సాంక్షన్‌లో, ప్రతి వీసా స్టాంప్‌లో ఒక అభిమన్యుడు దాక్కుని ఉంటాడు.

#### గుర్తుంచుకోండి...

నిజాన్ని ఒప్పుకోవడానికి నొప్పిస్తుంది. కానీ అబద్ధం మాత్రం ప్రతిరోజూ కొంచెం కొంచెంగా చంపుతుంది. వ్యవస్థ ఒక్క రోజులో మారదు. కానీ కళ్లు తెరవడం మాత్రం ఇవాళ్టి నుంచే మొదలవ్వాలి.
అదే పద్మవ్యూహం. అభిమన్యుడు పద్మవ్యూహంలో ఎందుకు చనిపోయాడో మనందరికీ తెలుసు. కానీ ఈ రోజుల్లో అభిమన్యులు ఎందుకు మానసికంగా చనిపోతున్నారు అన్న ప్రశ్న మాత్రం ఇంకా ఎవ్వరు అడగడం లేదు.
వ్యూహం ఒక్క రోజులో మారదు. కానీ వ్యూహాన్ని గుర్తించడం మాత్రం ఈ రోజు నుంచే మొదలవ్వాలి. ఎందుకంటే... లోపలికి వెళ్లడం ధైర్యం. బయటికి రావడం అదృష్టం.



ప్రపంచ టెక్ మార్కెట్ ఎదురుచూసిన క్షణం వచ్చేసింది. కుపర్టినోలోని ఆపిల్ పార్క్‌లో నిర్వహించిన "సర్‌ప్రైజ్ అండ్ షైన్" కార్యక్రమంలో ఆపిల్ తన కొత్త ఐఫోన్ 18 సిరీస్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌తో పాటు సంస్థ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ను కూడా ఆవిష్కరించింది. దీంతో ఆపిల్ ఫోల్డబుల్ ఫోన్ మార్కెట్‌లోకి అధికారికంగా అడుగుపెట్టింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమం టెక్ ప్రపంచంలో సంచలనంగా మారింది. ఈ లాంచ్‌లో అందరి దృష్టిని ఆకర్షించినది ఐఫోన్ 18 కంటే కూడా ఆపిల్ తొలి మడత ఫోన్‌పైనే. పుస్తకం మాదిరిగా మధ్య నుంచి తెరుచుకునే డిజైన్‌తో ఈ ఫోన్‌ను రూపొందించింది. మడిచినప్పుడు సాధారణ స్మార్ట్‌ఫోన్‌గా, విప్పినప్పుడు ట్యాబ్లెట్ తరహా పెద్ద స్క్రీన్‌గా ఉపయోగించుకునేలా దీన్ని తీర్చిదిద్దింది. ఫోల్డబుల్ ఫోన్‌కు "ఐఫోన్ ఫోల్డ్" అనే పేరును ఆపిల్ ఖరారు చేసింది. శామ్‌సంగ్, హువావే, మోటరోలా వంటి సంస్థలు ఇప్పటికే ఫోల్డబుల్ విభాగంలో పోటీ పడుతున్నప్పటికీ.. ఆపిల్ ప్రవేశంతో ఈ మార్కెట్‌కు కొత్త ఊపు వచ్చింది. ఆపిల్ ఎకోసిస్టమ్, ఐఓఎస్ అనుభవం, ప్రీమియం డిజైన్‌తో ఐఫోన్ ఫోల్డ్ ప్రత్యర్థులకు గట్టి సవాల్‌గా మారనుంది. ఐఫోన్ ఫోల్డ్‌లో 7.8 అంగుళాల అంతర్గత డిస్‌ప్లేను అందించారు. బయట 5.5 అంగుళాల కవర్ స్క్రీన్ ఉంది. మడిచినప్పుడు చేతిలో సులభంగా పట్టుకునేలా, విప్పినప్పుడు వీడియోలు, గేమింగ్, మల్టీటాస్కింగ్‌కు అనువుగా ఉండేలా డిజైన్ చేశారు. పెద్ద స్క్రీన్‌పై ఒకేసారి పలు యాప్‌లను ఉపయోగించుకునే సదుపాయాన్ని ఆపిల్ అందించింది. ఫోల్డబుల్ ఫోన్లలో సాధారణంగా కనిపించే స్క్రీన్ మడత సమస్యను తగ్గించేందుకు కొత్త హింజ్ వ్యవస్థను ఉపయోగించింది. అల్ట్రా థిన్ గ్లాస్, మెరుగైన నిర్మాణ సాంకేతికతతో స్క్రీన్ మన్నికను పెంచినట్లు ఆపిల్ తెలిపింది. ఫోన్‌ను పదేపదే మడిచినా, విప్పినా పనితీరులో ఇబ్బంది లేకుండా రూపొందించినట్లు వెల్లడించింది.



- కొత్త ఫోన్‌తో స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో కొత్త శకం
- మడతలో ఆపిల్ సంచలనం.. ధరలో భారీ షాక్
- ఐఫోన్ 18తో వరల్డ్ టెక్ మార్కెట్‌లో ప్రకంపనలు

# మడిస్తే ఫోన్.. విప్పితే ట్యాబ్లెట్

## అసలు సంచలనం.. ఫోల్డబుల్ ఫోన్

### ధరే పెద్ద షాక్! ఐఫోన్ 18 ప్రోలో పవర్‌ఫుల్ మార్పులు

ఆపిల్ ఐఫోన్ 18 ప్రో ధర మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ప్రీమియంగా ఉంది. భారత మార్కెట్‌లో దీని ప్రారంభ ధర రూ.1,64,900గా నిర్ణయించింది. అధిక స్టోరేజ్ వేరియంట్ ధర రూ.3,14,900 వరకు ఉంది. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ.. ఆపిల్ అభిమానుల్లో ఈ ఫోన్‌పై ఆసక్తి తగ్గలేదు. ప్రీబుకింగ్స్ సెప్టెంబర్ 12న ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 18 నుంచి విక్రయాలు మొదలవుతాయి. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో ఐఫోన్ 18 ప్రో కొత్త బెంచ్‌మార్క్‌గా నిలిచే అవకాశం ఉంది. ఐఫోన్ 18 ప్రోలో 6.3 అంగుళాల సూపర్ రెటినా ఎక్స్‌డీఆర్ డిస్‌ప్లేను అందించారు. కొత్త A20 ప్రో చిప్‌తో ఈ ఫోన్ పనిచేస్తుంది. గతంలో చిప్‌తో పోలిస్తే ప్రాసెసింగ్ వేగం, గ్రాఫిక్స్ పనితీరు, పవర్ ఎఫిషియెన్సీ గణనీయంగా మెరుగుపడినట్లు ఆపిల్ తెలిపింది. ఐఓఎస్ 27తో వచ్చే ఈ ఫోన్‌లో ఏఐ ఆధారిత ఫీచర్లను మరింత విస్తరించారు. ఫొటో ఎడిటింగ్, లైవ్ ట్రాన్స్‌లేషన్, నోటిఫికేషన్ సమ్మరీ, స్మార్ట్ సిరి వంటి ఫీచర్లు వేగంగా పనిచేసేలా రూపొందించారు. గేమింగ్, వీడియో ఎడిటింగ్, మల్టీటాస్కింగ్‌లోనూ మెరుగైన పనితీరును అందిస్తుందని సంస్థ పేర్కొంది.

### ప్రో మ్యాక్స్‌లో బ్యాటరీ బలం.. కెమెరాలో భారీ అప్‌గ్రేడ్

ఐఫోన్ 18 ప్రోలో కెమెరా వ్యవస్థను ఆపిల్ పూర్తిగా మెరుగుపరిచింది. తొలిసారిగా వేరియబుల్ అపెర్చర్ టెక్నాలజీని అందించింది. పరిస్థితిని బట్టి లెన్స్‌లోకి వచ్చే కాంతిని నియంత్రించే ఈ సాంకేతికతతో తక్కువ వెలుతురులోనూ మెరుగైన ఫొటోలు తీయవచ్చు. పోర్ట్రెయిట్ ఫొటోలు, నైట్ ఫొటోగ్రఫీ, వీడియో రికార్డింగ్‌లో నాణ్యత పెరిగింది. కెమెరా కంట్రోల్ బటన్‌లోనూ మార్పులు చేసింది. జూమ్, ఫోకస్, ఎక్స్‌పోజర్ వంటి సెట్టింగులను వేగంగా మార్చుకునేలా దీన్ని రూపొందించింది. ప్రొఫెషనల్ వీడియో రికార్డింగ్ కోసం కొత్త సినిమాటిక్ మోడ్‌ను కూడా అందించింది. ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌లో 6.9 అంగుళాల డిస్‌ప్లే కొనసాగింది. ఈ మోడల్‌లో బ్యాటరీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచింది. గత మోడల్‌తో పోలిస్తే వీడియో ప్లేబ్యాక్‌లో అదనంగా పలు గంటల బ్యాకప్ లభిస్తుందని ఆపిల్ తెలిపింది. గేమింగ్, వీడియో స్ట్రీమింగ్, కెమెరా వినియోగం ఎక్కువగా చేసే వారికి ప్రో మ్యాక్స్ అనుకూలంగా ఉండేలా రూపొందించింది. వేగవంతమైన ఛార్జింగ్, మెరుగైన వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయాలను కూడా అందించింది.



### ఏఐ.. ఆపిల్ మరో ఆయుధం

ఈసారి ఐఫోన్ 18 సిరీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఆపిల్ పెద్దపీట వేసింది. కొత్త సిరి వినియోగదారుల ఆదేశాలను మరింత సహజంగా అర్థం చేసుకునేలా పనిచేస్తుంది. సందేశాలు, ఈమెయిల్స్, నోటిఫికేషన్లు, ఫొటోలు, క్యాలెండర్ వంటి అంశాలను ఏఐ ఆధారంగా నిర్వహించుకునే సదుపాయాలను అందించింది. ఐఫోన్ ఫోల్డ్‌లోని పెద్ద స్క్రీన్‌ను ఏఐ ఫీచర్లతో అనుసంధానం చేసింది. ఒకేసారి పలు పనులను నిర్వహించుకునేలా స్మార్ట్ మల్టీటాస్కింగ్ సదుపాయాన్ని అందించింది. దీంతో ఫోల్డబుల్ ఐఫోన్ కేవలం పెద్ద స్క్రీన్ ఫోన్‌గా కాకుండా.. వ్యక్తిగత ఏఐ వర్క్‌స్టేషన్‌గా ఉపయోగపడే అవకాశం ఉంది. ఐఫోన్‌తో పాటు ఆపిల్ వాచ్ సిరీస్ 12, ఆపిల్ వాచ్ అల్ట్రా 4ను కూడా సంస్థ విడుదల చేసింది. ఆరోగ్య పర్యవేక్షణ, నిద్ర విశ్లేషణ, హార్ట్‌రేట్ మానిటరింగ్, రక్తపోటు హెచ్చరికలు వంటి ఫీచర్లను కొత్త వాచ్‌లలో అందించింది. కొత్త ఎయిర్‌పాడ్స్‌లో హార్ట్‌రేట్ ట్రాకింగ్, మెరుగైన నాయిస్ క్యాన్సిలేషన్, లైవ్ ట్రాన్స్‌లేషన్ వంటి సదుపాయాలను చేర్చింది. ఐఫోన్, వాచ్, ఎయిర్‌పాడ్స్ మధ్య మరింత మెరుగైన అనుసంధానాన్ని కల్పించింది.

### పెరిగిన ఐఫోన్ ధరలు.. ప్రత్యర్థులకు ఆపిల్ హెచ్చరిక

ఆపిల్ ఫోల్డబుల్ రంగంలోకి రావడంతో శామ్‌సంగ్, హువావే, షావోమీ వంటి సంస్థలకు పోటీ మరింత పెరిగింది. ఇప్పటివరకు ఫోల్డబుల్ మార్కెట్‌లో ముందున్న సంస్థలు.. ఇప్పుడు ఆపిల్ బ్రాండ్ విలువ, సాఫ్ట్‌వేర్ ఎకోసిస్టమ్, ప్రీమియం వినియోగదారుల బలాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఫోల్డబుల్ ఫోన్ మార్కెట్ మొత్తం స్మార్ట్‌ఫోన్ విభాగంలో చిన్న భాగమే అయినప్పటికీ.. ఆపిల్ ప్రవేశంతో ఈ విభాగం వేగంగా విస్తరించే అవకాశం ఉంది. ఇతర సంస్థలు కూడా కొత్త డిజైన్లు, తక్కువ ధరల మోడళ్లతో ముందుకు వచ్చే అవకాశముంది. ఐఫోన్ 18 సిరీస్‌లో ధరలు గత మోడళ్లతో పోలిస్తే పెరిగాయి. తయారీ వ్యయాలు, మెమరీ చిప్‌ల ధరలు, కెమెరా భాగాల ఖర్చు పెరగడం ఇందుకు కారణమని ఆపిల్ వర్గాలు తెలిపాయి. ఐఫోన్ 18 ప్రో ప్రారంభ ధర భారత మార్కెట్‌లో రూ.1,64,900గా ఉంది. ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ప్రారంభ ధర రూ.1,79,900గా నిర్ణయించింది. ధరలు పెరిగినా.. ప్రీమియం విభాగంలో ఐఫోన్‌కు ఉన్న డిమాండ్ కొనసాగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈఎంఐలు, బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ పథకాలతో వినియోగదారులకు కొంత ఉపశమనం లభించనుంది.

### భారత్‌లో పెరిగిన ఐఫోన్ జోరు.. భారత్ ఎందుకు కీలకం?

భారత మార్కెట్‌లో ఐఫోన్ 18 సిరీస్‌కు భారీ స్పందన లభించింది. ప్రీబుకింగ్స్ ప్రారంభమైన వెంటనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో డిమాండ్ పెరిగింది. ప్రధాన నగరాల్లోని ఆపిల్ స్టోర్ల వద్ద ముందస్తు బుకింగ్స్ కోసం వినియోగదారులు ఆసక్తి చూపించారు. భారత్‌లో ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్, ఐఫోన్ ఫోల్డ్ విక్రయాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దేశంలోని ఎంపిక చేసిన ఆపిల్ స్టోర్లు, అధీకృత రిటైల్ కేంద్రాలు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో ఇవి అందుబాటులోకి రానున్నాయి. భారత్‌లో ఐఫోన్ విక్రయాలతో పాటు తయారీ కూడా పెరుగుతోంది. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక కేంద్రంగా ఎదుగుతోంది. కొత్త ఐఫోన్ సిరీస్‌లోని కొన్ని మోడళ్లను దేశీయంగా అసెంబుల్ చేస్తున్నట్లు ఆపిల్ వెల్లడించింది. భారత మార్కెట్‌లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌లకు పెరుగుతున్న డిమాండ్, యువతలో ఐఫోన్ క్రేజ్, ఈఎంఐ సదుపాయాలు ఆపిల్‌కు అనుకూలంగా మారాయి. అమెరికా, చైనా తర్వాత భారత్ ఆపిల్‌కు అత్యంత కీలక మార్కెట్లలో ఒకటిగా నిలిచింది.

### ధర పెరిగినా క్రేజ్ తగ్గలేదు.. ఆపిల్ అసలు ప్లాన్ ఇదే

ఐఫోన్ 18 సిరీస్ ధరలు పెరిగినప్పటికీ.. వినియోగదారుల ఆసక్తి తగ్గలేదు. బ్రాండ్ విలువ, కెమెరా నాణ్యత, సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, ఆపిల్ ఎకోసిస్టమ్ కారణంగా అధిక ధర చెల్లించేందుకు వినియోగదారులు సిద్ధంగా ఉన్నారు. కొంతమంది వినియోగదారులు ప్రో మోడళ్లను ఎంచుకుంటుండగా.. మరికొందరు పాత ఐఫోన్ మోడళ్లపై డిస్కౌంట్లను పరిశీలిస్తున్నారు. ఫోల్డబుల్ ఐఫోన్ మాత్రం అత్యంత ప్రీమియం వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంది. ఈ లాంచ్‌తో ఆపిల్ కేవలం కొత్త ఫోన్‌ను విడుదల చేయలేదు. ప్రీమియం మార్కెట్‌లో తన ఆధిపత్యాన్ని మరింత బలపరిచింది. ఫోల్డబుల్ ఫోన్‌తో కొత్త కేటగిరీలోకి అడుగుపెట్టింది. ఏఐ ఫీచర్లతో వినియోగ అనుభవాన్ని మార్చే ప్రయత్నం చేసింది. వాచ్, ఎయిర్‌పాడ్స్‌తో తన ఎకోసిస్టమ్‌ను మరింత విస్తరించింది. వినియోగదారుడు ఒక్క ఐఫోన్ కొనడమే కాకుండా.. ఆపిల్ ఉత్పత్తుల మొత్తం ప్రపంచంలో భాగమయ్యేలా చేయడమే సంస్థ వ్యూహంగా కనిపిస్తోంది. ఐఫోన్ ఫోల్డ్ ఈ వ్యూహానికి అత్యంత కీలకమైన అడుగుగా నిలిచింది.




### టిమ్ కుక్ తర్వాత.. ఐఫోన్ కథలో కొత్త అధ్యాయం

టిమ్ కుక్ తర్వాత ఆపిల్ నాయకత్వంలో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఈ లాంచ్ సంస్థకు కీలకంగా మారింది. ఏఐ పోటీ, ఫోల్డబుల్ టెక్నాలజీ, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, చైనా మార్కెట్‌లో పోటీ వంటి సవాళ్ల మధ్య ఆపిల్ తన కొత్త దిశను స్పష్టంగా చూపించింది. ఫోల్డబుల్ ఐఫోన్ విడుదలతో ఆపిల్ భవిష్యత్ ఉత్పత్తులపై కూడా సంకేతాలు ఇచ్చింది. పెద్ద స్క్రీన్, ఏఐ, ఎకోసిస్టమ్.. ఈ మూడు అంశాల చుట్టూనే సంస్థ తదుపరి వ్యూహం ఉండబోతున్నట్లు స్పష్టమైంది. ఐఫోన్ 18 సిరీస్ విడుదల సాధారణ వార్షిక అప్‌గ్రేడ్‌గా మిగలలేదు. ఐఫోన్ ఫోల్డ్ ఆపిల్ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. భారీ ధర ఉన్నప్పటికీ వినియోగదారులు ఈ ఫోన్‌ను స్వీకరిస్తే.. ఫోల్డబుల్ ఫోన్ విభాగం ప్రధాన స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా మారే అవకాశం ఉంది. ఆపిల్ ఫోల్డ్ విజయవంతమైతే.. ఇతర సంస్థలు కూడా తమ ఫోల్డబుల్ ఫోన్లపై మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ధరలు తగ్గడం, డిజైన్‌లు మెరుగుపడటం, కొత్త ఫీచర్లు రావడం ద్వారా వినియోగదారులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ఆపిల్ ఐఫోన్ 18 సిరీస్‌ను విడుదల చేయడం ద్వారా మరోసారి మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేసింది. ఐఫోన్ 18 ప్రో, ప్రో మ్యాక్స్ కెమెరా, చిప్, బ్యాటరీ, ఏఐ ఫీచర్లలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాయి. ఐఫోన్ ఫోల్డ్ మాత్రం ఆపిల్‌ను ఫోల్డబుల్ ప్రపంచంలోకి తీసుకెళ్లింది. భారత్‌లో పెరుగుతున్న ఐఫోన్ క్రేజ్, ప్రపంచవ్యాప్తంగా ప్రీమియం ఫోన్‌లకు పెరుగుతున్న డిమాండ్, ఫోల్డబుల్ టెక్నాలజీపై ఆసక్తి, ఏఐ పోటీ.. ఇవన్నీ ఈ లాంచ్‌ను మరింత కీలకంగా మార్చాయి. ఆపిల్ ఫోల్డబుల్ మార్కెట్‌లోకి అడుగుపెట్టడం మరో ఫోన్ విడుదల కాదు. మొత్తం మొబైల్ మార్కెట్‌కు కొత్త దిశ చూపించిన ప్రకటనగా చూడాలి.








## భారత్‌లోకి ఫిలిప్స్ తొలి 5జీ ఫోన్

- తక్కువ ధరలో 5జీ ఫోన్.. ఫీచర్లతో ఫుల్ ప్యాక్!
- ఐఫోన్ వంటి ఖరీదైన స్మార్ట్‌ఫోన్లకు ప్రత్యామ్నాయంగా మంచి ఫీచర్లు..

అందుబాటు ధర కోరుకునే వారికి ఫిలిప్స్ కొత్త ఆప్షన్ తీసుకొచ్చింది. టీవీలు, గృహోపకరణాలు, గ్రూమింగ్ ఉత్పత్తులతో గుర్తింపు పొందిన ఫిలిప్స్ సంస్థ తొలిసారిగా భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. Philips S7221 5G పేరుతో కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. 6GB RAM, 128GB స్టోరేజ్ వేరియంట్ ధర రూ.20,499, 8GB RAM, 128GB స్టోరేజ్ మోడల్ ధర రూ.22,499గా నిర్ణయించింది. బ్లాక్, బ్లూ, గ్రే రంగుల్లో అమెజాన్‌లో ఈ ఫోన్ లభిస్తోంది. డ్యూయల్ 5జీ సిమ్ సపోర్ట్ ఉండటం ఈ ఫోన్‌లో మరో ప్రత్యేకత.

**120Hz స్క్రీన్.. 64MP కెమెరా**

ఫిలిప్స్ S7221 5Gలో 6.67 అంగుళాల HD+ LCD డిస్‌ప్లే, 720×1600 పిక్సెల్స్ రిజల్యూషన్ ఉన్నాయి. వేగవంతమైన స్క్రోలింగ్, స్మూత్ విజువల్స్ కోసం 120Hz రిఫ్రెష్ రేట్ అందించారు. ఫోన్‌లో ఆక్టాకోర్ Spreadtrum T765 చిప్‌సెట్, గరిష్ఠంగా 8GB LPDDR4 RAM, 128GB స్టోరేజ్ ఉన్నాయి. Android 16 ఆపరేటింగ్ సిస్టమ్‌తో వస్తుంది. ఫోటోగ్రఫీ కోసం 64MP రియర్ కెమెరా, 16MP ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. AI సీన్ ఆప్టిమైజేషన్, పోర్ట్రెయిట్ మోడ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఫోన్‌కు 5,700mAh భారీ బ్యాటరీ, 25W ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ అందించారు. బాక్స్‌లో ఛార్జర్, స్క్రీన్ ప్రొటెక్టర్, ఫోన్ కేస్ కూడా ఇస్తున్నారు. మొత్తంగా చూస్తే తక్కువ ధరలో 5జీ కనెక్టివిటీ, పెద్ద బ్యాటరీ, 120Hz డిస్‌ప్లే కోరుకునే వారికి Philips S7221 5G ఆసక్తికరమైన ఎంపికగా నిలవనుంది.

# ఈస్ట్ జోన్‌దే దులీప్ కప్!



చెపాక్ వేదికగా దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ టైటిల్‌కు మరింత చేరువైంది. భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం, ఇషాన్ కిషన్ దూకుడు బ్యాటింగ్‌తో మ్యాచ్‌పై పట్టు బిగించింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 212/5తో నిలిచి, ఓవరాల్‌గా 584 పరుగుల ఆధిక్యం సాధించింది. అంతకుముందు ఈస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు చేయగా, సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌటైంది. సౌత్ కెప్టెన్ తిలక్ వర్మ 80 పరుగులతో పోరాటం చూపించినా, జట్టు లోటును పూడ్చలేకపోయింది. ఇషాన్ కిషన్ మరోసారి రెడ్‌బాల్ క్రికెట్‌లో తన సత్తా చాటుతూ 98 బంతుల్లో 99 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లోనే 270 పరుగులు చేసిన ఇషాన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. త్రిపురానా విజయ్‌పై వరుసగా 4, 6, 6, 4 బాదుతూ శతకానికి చేరువయ్యాడు. అయితే చివరకు నిధీష్ బౌలింగ్‌లో క్యాచ్ ఇచ్చి ఒక్క పరుగు దూరంలో శతకాన్ని కోల్పోయాడు. మరోవైపు సిరాజ్ వేగం, కచ్చితత్వంతో పుంజుకోవడం కనిపించింది. అయినా ఈస్ట్ జోన్ భారీ ఆధిక్యం ముందు సౌత్ పోరాటం దాదాపు ముగిసినట్టే కనిపిస్తోంది.

# పాక్ క్రికెట్ నా వల్ల కాదు!



పాకిస్థాన్ క్రికెట్ పతనంపై దిగ్గజ పేసర్ వసీం అక్రమ్ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. "నేను పాకిస్థాన్ క్రికెట్‌ను బాగు చేయలేను.. సమస్యలు చాలా లోతుగా ఉన్నాయి" అంటూ అక్రమ్ తన అసహాయతను వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌తో మూడో టెస్టులోనూ పాక్ ఓడిపోయి 3-0తో సిరీస్ కోల్పోయినా ఆశ్చర్యం లేదన్నాడు. జట్టు బ్యాటింగ్ బలహీనంగా ఉందని, బౌలింగ్ సగటు స్థాయిలోనే ఉందని, ఫీల్డింగ్ మరింత దారుణంగా మారిందని విమర్శించాడు. సమస్య కేవలం ఆటగాళ్లలోనో, క్రికెట్ బోర్డులోనో లేదని.. వ్యవస్థ మొత్తం బలహీనపడిందని స్పష్టం చేశాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో స్థిరత్వం, సహనం లేకపోవడం ప్రతిభావంతులైన ఆటగాళ్ల ఎదుగుదలను దెబ్బతీస్తోందని అన్నాడు. దిగువ స్థాయిలో బలమైన వ్యవస్థ లేకపోవడంతో జాతీయ జట్టుపై ప్రభావం పడుతోందని పేర్కొన్నాడు. వరుస పరాజయాలతో అభిమానులు వ్యవస్థను పూర్తిగా మార్చాలని కోరుకోవడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తోందని చెప్పాడు. "చప్పట్లు కొట్టాలంటే రెండు చేతులు కావాలి" అంటూ ఆటగాళ్ల వైఖరి కూడా పాక్ క్రికెట్ పతనానికి కారణమని అక్రమ్ పరోక్షంగా చురకలంటించాడు. తాజాగా ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు పలువురు అరంగేట్ర ఆటగాళ్లను పాక్ బరిలోకి దింపుతోంది.

# సచిన్ వైపు జో రూట్ పరుగులు!



బ్యాట్ ఝుళిపించకుండానే జో రూట్ మరో చరిత్ర సృష్టించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న మూడో టెస్టులో బరిలోకి దిగిన రూట్ 169వ టెస్ట్ మ్యాచ్‌తో అత్యధిక టెస్టులు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానానికి ఎగబాకాడు. 168 టెస్టులతో ఉన్న ఆస్ట్రేలియా దిగ్గజాలు రికీ పాంటింగ్, స్టీవ్ వాను వెనక్కి నెట్టి రూట్ కొత్త మైలురాయి అందుకున్నాడు. ఈ జాబితాలో 200 టెస్టులతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా, 188 మ్యాచ్‌లతో జేమ్స్ ఆండర్సన్ రెండో స్థానంలో ఉన్నాడు. 168 టెస్టుల్లో 14,208 పరుగులు, 41 శతకాలతో రూట్ ఇప్పటికే ఆధునిక టెస్ట్ క్రికెట్‌లో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు అతడి చూపు సచిన్ రికార్డు వైపేనా అన్న ఆసక్తి పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఇంగ్లండ్ వైట్‌బాల్ జట్టుకు కెవిన్ పీటర్సన్ మెంటర్‌గా రావడాన్ని రూట్ స్వాగతించాడు. తన కెరీర్ ఆరంభంలో పీటర్సన్‌ను దగ్గరగా గమనిస్తూ, ముఖ్యంగా స్పిన్‌ను ఎలా ఎదుర్కోవాలో అతడి నుంచి నేర్చుకున్న విషయాలను గుర్తుచేసుకున్నాడు. పీటర్సన్ అనుభవం వచ్చే వన్డే ప్రపంచకప్‌కు ఇంగ్లండ్‌కు భారీగా ఉపయోగపడుతుందని రూట్ నమ్ముతున్నాడు.

# బుమ్రా రాకపై ఉత్కంఠ!



టీమిండియా అభిమానులను ఊరిస్తున్న ప్రశ్నకు త్వరలోనే సమాధానం రానుంది. అఫ్గానిస్థాన్‌తో సెప్టెంబర్ 13 నుంచి ప్రారంభమయ్యే మూడు టీ20ల సిరీస్‌కు జస్ప్రీత్ బుమ్రా అందుబాటులోకి వస్తాడా? ప్రస్తుతం బుమ్రా మోకాలి గాయం నుంచి కోలుకుంటూ రీ ఎంట్రీకి సిద్ధమవుతున్నట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఇంగ్లండ్ పర్యటనలో జూలైలో చివరిసారిగా ఆడిన స్టార్ పేసర్ ఆ తర్వాత క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఇదే సమయంలో మరో పేసర్ హర్షిత్ రాణా హ్యామ్‌స్ట్రింగ్ గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో అఫ్గాన్ సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాణా ఫిట్‌నెస్‌పై సందేహాలు కొనసాగుతున్నా.. బుమ్రా, నితీశ్ రెడ్డి మాత్రం పునరాగమనానికి ట్రాక్‌లో ఉన్నారని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. మోకాలి గాయంతో బుమ్రా, క్వాడ్రిసెప్స్ గాయంతో నితీశ్ చికిత్స పొందుతున్నారు. అఫ్గాన్ సిరీస్ తర్వాత సెప్టెంబర్ 22న జపాన్‌తో భారత్ ప్రత్యేక మ్యాచ్ ఆడనుంది. ఆపై సెప్టెంబర్ 28 నుంచి ఆసియా క్రీడల సమరం మొదలవుతుంది. బుమ్రా రీ ఎంట్రీ అయితే భారత పేస్ దళానికి అదనపు బలం.. అదే సమయంలో టీ20ల్లో అతడి ఫిట్‌నెస్‌పై జట్టు మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా దృష్టి పెట్టే అవకాశం ఉంది.

# బిగ్‌బాష్ తలుపులు తెరిచింది!



ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఇప్పుడు కొత్త ఇన్నింగ్స్ మొదలైంది. క్రికెట్ ఆస్ట్రేలియా బిగ్‌బాష్ లీగ్‌లోకి ప్రైవేట్ పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఐపీఎల్ ఫ్రాంచైజీల కన్ను ఆస్ట్రేలియా మార్కెట్‌పై పడింది. 2027-28 సీజన్ నుంచి మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను 100 శాతం ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా టీ20 ఫ్రాంచైజీలను సొంతం చేసుకున్న రిలయన్స్, ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ, రెడ్ చిల్లీస్ వంటి భారతీయ సంస్థలకు ఇది మరో భారీ అవకాశంగా మారింది. ఒకే యాజమాన్యం కింద ఐపీఎల్, బీబీఎల్, ఎస్ఏ20, ఎంఎల్‌సీ జట్లను నడిపితే ఆటగాళ్లతో ఏడాది పొడవునా అనుబంధం పెంచుకునే అవకాశం లభిస్తుంది. అయితే భారత క్రికెటర్లకు విదేశీ లీగ్‌ల్లో ఆడేందుకు బీసీసీఐ అనుమతి ఇవ్వకపోవడం ఇప్పటికీ పెద్ద అడ్డంకే. మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, సాలరీ క్యాప్‌పై నియంత్రణ కొనసాగించనుంది. బీబీఎల్ జట్టు విలువ 15-20 కోట్ల ఆస్ట్రేలియన్ డాలర్ల మధ్య ఉండొచ్చన్న అంచనాలు ఆసక్తిని పెంచుతున్నాయి. టీ20 క్రికెట్ గ్లోబల్ మార్కెట్‌లో ఇది కొత్త పవర్ గేమ్‌కు నాంది కానుందా?

# ఆ భయం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది



సినీ పరిశ్రమలో విజయాలు ఎంత గుర్తింపు తీసుకొస్తాయో... పరాజయాలు అంతకంటే ఎక్కువ ఒత్తిడిని మోసుకొస్తాయి. ముఖ్యంగా సోషల్ మీడియా హవా నడుస్తున్న నేటికాలంలో సినిమా ఫలితం తేడా కొడితే నటీనటులపై వచ్చే ట్రోలింగ్ వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తుంది. ఇలాగే హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజా ఇంటర్వ్యూలో చెబుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా అభిలాష్ జోషి దర్శకత్వంలో సుమారు రూ.50 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ‘ కింగ్ ఆఫ్ కోథా ’ ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ సినిమా పరాజయం తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితంపై చూపిన ప్రతికూల ప్రభావం గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. 2023లో భారీ హైప్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘కింగ్ ఆఫ్ కోథా’ బాక్సాఫీస్ వద్ద చతికిలబడటంతో పాటు, నెట్టింట తీవ్రమైన విమర్శలను ఎదుర్కొంది. చిత్ర బృందంతో పాటు తనపై వచ్చిన ట్రోలింగ్ తనను తీవ్రంగా కలచివేసిందని ఐశ్వర్య తెలిపారు. సినిమాలో తన నటన, సంభాషణలు పలికే తీరుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయని, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుల విమర్శలు నిజమేనేమో అని తానూ భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా దుల్కర్ పాత్రను ఉద్దేశించి తాను పలికిన ‘రాజువెట్టా’ అనే సంభాషణ నెట్టింట దారుణంగా ట్రోలింగ్‌కు గురైందని గుర్తుచేసుకున్నారు. ఈ నెగెటివిటీ అక్కడితో ఆగకుండా షూటింగ్ లొకేషన్లకూ పాకిందని ఐశ్వర్య గుర్తు చేసుకున్నారు. ‘హలో మమ్మీ’ సినిమా షూటింగ్ సమయంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తనను ఉద్దేశపూర్వకంగా ఆ పేరుతో పిలిచి గేలి చేయడంతో తీవ్రంగా మనస్తాపం చెందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సినిమా తెచ్చిన ప్రతికూల ప్రభావంతో మలయాళ చిత్ర పరిశ్రమలో దర్శకనిర్మాతలు తనకు కొత్త అవకాశాలు ఇచ్చేందుకు వెనుకాడేవారని పేర్కొన్నారు. ఈ ట్రోల్స్ తెచ్చిన భయం ఎంతవరకు వెళ్లిందంటే, ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఒక కమర్షియల్ యాడ్‌లో నటించే అవకాశం వచ్చినా ఆమె రిజెక్ట్ చేశారట. ‘నేను ఆయనతో నటిస్తే మళ్లీ ట్రోలింగ్ మొదలై మీ ప్రాజెక్ట్‌కే ఇబ్బందిగా మారుతుంది’ అని చెప్పి మరీ ఆ ఆఫర్‌ను వదులుకున్నానని, ఈ చేదు అనుభవం వల్ల దుల్కర్‌తో మళ్లీ కలిసి పనిచేయగలనా అనే సందేహం కలుగుతోందని ఐశ్వర్య లక్ష్మి తెలిపారు. గత చేదు జ్ఞాపకాలను అధిగమిస్తూ ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి ఇతర పరిశ్రమల్లో బలమైన ముద్ర వేస్తున్నారు. తమిళంలో ఇటీవల ‘గట్ట కుస్తీ 2’తో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, తెలుగులో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా ఎదుగుతున్నారు. సాయి దుర్గా తేజ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం ‘సంబరాల ఏటి గట్టు’ షూటింగ్ చివరి దశకు చేరుకుని, వచ్చే సంక్రాంతి బరిలో దిగేందుకు సిద్ధమవుతోంది.

# ‘రణబాలి’లో యోధుడిగా విజయ్



విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్‌ఇండియా చిత్రం ‘రణబాలి’. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 18541878ల నాటి బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో, రాయలసీమ ప్రాంతంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. ఇందులో విజయ్ పవర్‌ఫుల్ యోధుడిగా కనిపిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా కానుకగా విడుదల కానుంది. వారు ఆ కథను పాతిపెట్టారు.. వారు ఆ పేరును చెరిపివేశారు. వారు తమ పాపాలను తుడిచిపెట్టారు. కానీ అతని రౌద్రాగ్నిని మాత్రం ఎప్పటికీ పాతిపెట్టలేకపోయారు. జానపద గాథలు, చరిత్ర అతన్ని ఎప్పటికీ మరువవు. రణబాలి.. ఆ యోధుడి ప్రతిజ్ఞ" అని మేకర్స్ పేర్కొన్నారు. ''అతిథులుగా వచ్చి, అణచివేతదారులుగా మిగిలిపోయిన వారిని. రక్తం చిందించాలని నిర్ణయించుకున్న మన గ్రామాల్లోని ఆ మనుషులను.. ఎప్పటికీ మర్చిపోవద్దు" అని విజయ్ దేవరకొండ పోస్ట్ పెట్టారు. 1854 1878 మధ్య కాలంలో బ్రిటిష్ ఇండియాలో రాయలసీమ ప్రాంతంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ‘రణబాలి’ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో రణబాలి అనే వీరుడిగా విజయ్ దేవరకొండ కనిపిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రను రష్మిక పోషించారు. అజయ్ అతుల్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా, జిష్ణు భట్టాచార్జీ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు.’రణబాలి’ చిత్రాన్ని టీసిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని & వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ‘గీత గోవిందం’, ‘డియర్ కామ్రేడ’ తర్వాత విజయ్ రష్మిక కలిసి నటిస్తున్న సినిమా ఇది. భార్యాభర్తలుగా మారిన తర్వాత విరోష్ నుంచి రాబోయే తొలి సినిమా కావడంతో అభిమానులు ఎగ్జైటెడ్ గా ఉన్నారు.

# మారేమ్మకు ఏ సర్టిఫికెట్ జారీ!



మాస్ మహారాజ రవితేజ ఇటీవల ‘ఇరుముడి’ మూవీతో కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కిన ఇరుముడి మూవీ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. ఇప్పుడు రవితేజ తమ్ముడి కొడుకు మాధవ్ హీరోగా పరిచయం అవుతూ చేస్తున్న చిత్రం మారెమ్మ. ఈ మూవీ కూడా డివోషనల్ ప్లస్ థ్రిల్లర్ కాన్సెప్ట్ తో తెరకెక్కింది. ఇటీవల విడుదలైన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా సెప్టెంబర్ 10వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. ఈ చిత్రానికి మంచాల నాగరాజు దర్శకత్వం వహించారు. అలాగే మోక్ష ఆర్ట్స్ పతాకంపై మయూర్ రెడ్డి బండారు నిర్మించారు. మారెమ్మ చిత్రంలో మాధవ్ సరసన హీరోయిన్ గా తమిళ బ్యూటీ దీపా బాలు నటించింది. వీరితో పాటు ఈ మూవీలో వికాస్ వశిష్ట, వినోద్ కుమార్, వీఎస్ రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇక మారెమ్మ చిత్రం ఇటీవల సెన్సార్ కార్యక్రమాల్ని పూర్తి చేసుకుంది. ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 15 నిమిషాలు అంటే.. 135 నిమిషాలుగా ఉంది. తక్కువ రన్ టైమ్ కావడంతో సినిమా చాలా గ్రిప్పింగ్ గా ఉంటుందని తెలుస్తోంది. అనవసరమైన వాటికి పోకుండా స్ట్రెయిట్ గా పాయింట్ చెప్పే ప్రయత్నం చిత్ర యూనిట్ చేసినట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీకి సెన్సార్ బృందం ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అంటే 18 సంవత్సరాలు నిండిన వారు మాత్రమే ఈ సినిమా చూసేందుకు అర్హులని అర్థం. ఇక మారెమ్మ సినిమా మిగతా సినిమాల మాదిరి కాదు.. గ్రామీణ నేపథ్యంలో సాగే ఓ డివోషనల్ థ్రిల్లర్ కథే ఈ సినిమా. పెంపుడు జంతువులు, మానవుల మధ్య సంబంధాలను ఈ మూవీ ద్వారా సరికొత్తగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు దర్శకుడు మంచాల నాగరాజు.

# భన్సాలీతో కలిసి పనిచేయబోతున్నారా?



బాలీవుడ్ నటి కరీనా కపూర్ మరియు ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత ఒక కొత్త ప్రాజెక్ట్ పై చర్చలు జరుగుతున్నాయా? ఇటీవల కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇది నిజమైతే, కరీనా మరియు భన్సాలీ మధ్య 25 సంవత్సరాల తర్వాత జరిగే మొదటి సహకారం అవుతుంది, ఎందుకంటే వారు ‘దేవదాస’ సినిమా సమయంలో ఒక గొడవకు గురయ్యారు. సెప్టెంబర్ 8న కరీనా భన్సాలీ కార్యాలయానికి వెళ్లినప్పుడు పాస్టెల్ బ్లూ సూట్ ధరించి కనిపించింది. ఆమె పాపారాజ్జీకి ఫోటోలకు నిలబడలేదు. సంజయ్ లీలా భన్సాలీ తన తదుపరి చిత్రంలో మహిళా నాయకత్వ పాత్ర కోసం కరీనాను సంప్రదించినట్లు సమాచారం. ఈ చిత్రంలో ఆమె తమిళ నటుడు ధనుష్‌తో కలిసి నటించనుంది, అయితే అన్ని విషయాలు బాగా జరిగితేనే. ఈ చిత్రంలో ధనుష్‌తో పాటు ఆమెకు ముఖ్యమైన పాత్ర ఉండబోతుంది. కరీనా ఈ చిత్రానికి ఆసక్తి చూపించినప్పటికీ, ఆమె ఇంకా సంతకం చేయలేదు. ఆమె తేదీలు, ఫీజులు మరియు ఇతర వివరాల గురించి చర్చలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఒక పౌరాణిక సాహస కథగా ఉంటుందని సమాచారం, ఇది అటవీ ప్రాంతంలో జరుగుతుంది. కథ అధికారికంగా వెల్లడించబడలేదు, కానీ ఈ చిత్రంలో ఒక ఏనుగు ముఖ్యమైన పాత్ర పోషించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. భన్సాలీ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు, కాగా పి.ఎస్. మిత్రన్ దీనిని దర్శకత్వం వహించనున్నారు. ప్రాజెక్ట్ ప్రస్తుతం రచనలో ఉంది, ప్రీప్రొడక్షన్ ఈ సంవత్సరం చివర్లో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. షూటింగ్ 2027 జనవరిలో ప్రారంభమవుతుందని సమాచారం. కరీనా ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేస్తే, ఇది ఆమె మరియు భన్సాలీ మధ్య ఉన్న బాలీవుడ్‌లోని అత్యంత చర్చించబడిన వృత్తి గొడవను ముగించగలదు. కరీనా కపూర్ మరియు సంజయ్ లీలా భన్సాలీ మధ్య గొడవ 2000ల ప్రారంభంలో ప్రారంభమైంది, ఆ సమయంలో కరీనా ‘దేవదాస’ చిత్రంలో పారో పాత్ర కోసం పరిశీలనలో ఉన్నది. కరీనా ఈ పాత్ర కోసం స్క్రీన్ టెస్ట్ చేసింది మరియు సంతకం చేసిన మొత్తాన్ని కూడా పొందింది. అయితే, ఈ పాత్ర చివరకు ఐశ్వర్య రాయ్ బచ్చన్‌కు వెళ్లింది, ఆమె 2002లో షారుక్ ఖాన్‌తో కలిసి నటించింది. ఒక పాత ఫిల్మ్‌ఫేర్ ఇంటర్వ్యూలో, ఆమె భన్సాలీతో పని చేయనని చెప్పింది. "నేను ఎప్పుడూ చేయను. ఆయన నాకు చేసినది తప్పు. ఆయన నాకు ‘దేవదాస’ కోసం స్క్రీన్ టెస్ట్ ఇచ్చారు, సంతకం చేసిన మొత్తాన్ని ఇచ్చారు, తరువాత మరొకరిని తీసుకున్నారు. అది తప్పు, ఇది నాకు బాధ కలిగించింది, ఎందుకంటే నేను నా కెరీర్ ప్రారంభంలో ఉన్నాను. అది సరే, ఎందుకంటే ఆయన నన్ను విడిచిపెట్టిన రోజు నేను ‘యాదెయిన’కి సంతకం చేశాను. సంజయ్ నన్ను బాధపెట్టాడు. నేను పని లేకపోయినా, ఆయనతో పని చేయను" అని కరీనా చెప్పింది.

# నేడు రానున్న ‘మండాడి’



సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా ‘మండాడి’ నేడు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆరఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్‌పై మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మహిమా నంబియార్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ కీలక పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎలఎల్‌పి ఈ సినిమాను అత్యంత భారీ ఎత్తున విడుదల చేస్తోంది. తాజాగా ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్ బోర్డ్ ఈ సినిమాకి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేసింది. మూవీ చూసిన సెన్సార్ టీం సభ్యులు అద్భుతంగా వచ్చిందని అభినందించారు. ముఖ్యంగా ఇందులో వచ్చే బోట్ సీక్వెన్స్ ఒళ్లు గగుర్పొడిచేలా ఉన్నాయని, థియేటర్లలో ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెట్టడం ఖాయమని కొనియాడారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, మైండ్ బ్లోయింగ్ ట్రైలర్ సినిమాపై హైప్‌ను రెట్టింపు చేశాయి.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.